

గత వైసీపీ ప్రభుత్వం నిర్ణయాలు ఆక్వా సాగుపై తీవ్ర ప్రభావం చూపాయి. ఆక్వా జోన్ పరిధి కుదింపు, విద్యుత్ రాయితీల నిలిపివేతతో రొయ్యల సాగుకు రైతులు దూరమయ్యారు. భారీగా పెరిగిన విద్యుత్ చార్జీలు, మేత ధరలను భరించలేక సాగు నిలిపివేశారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కేబినెట్ సమావేశంలో రొయ్యల చెరువులకు ఆక్వాజోన్ పరిధితో సంబంధంలేకుండా విద్యుత్ రాయితీలను అందించాలని తీసుకున్న నిర్ణయం రైతుల్లో మళ్లీ ఆశలు చిగురింపజేసింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులు త్వరగా వచ్చే రొయ్యల సాగు విస్తీర్ణం జిల్లాలో మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు. - ఆంధ్రజ్యోతి, మచిలీపట్నం



రొయ్యల చెరువులో పట్టుబడి

ఆక్వాపై ఆశలు

వైసీపీ ప్రభుత్వంలో ఆక్వా జోన్ పేరుతో పరిధి కుదింపు

- రొయ్యల చెరువులకు విద్యుత్ రాయితీ నిలిపివేత
- దీంతో భారీగా పెరిగిన విద్యుత్ బిల్లులు
- సాగుకు దూరమైన ఆక్వా రైతులు
- ఆక్వా జోన్ పరిధితో సంబంధంలేకుండా విద్యుత్ రాయితీ ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం

నాడు ఆక్వా జోన్ గుర్తింపులో గజిబిజి

జిల్లాలో 111 కిలోమీటర్ల మేర సముద్ర తీరం ఉంది. ఈ తీరం వెంబడి ఉన్న మచిలీపట్నం, కృత్తివెన్ను, బంటుమిల్లి, పెడన, కోడూరు, నాగాయలంక, మోపిదేవి మండలాలతోపాటు నందివాడ మండలంలోనూ రొయ్యల చెరువుల సాగు జరుగుతోంది. రెండు, మూడు సంవత్సరాల కిందటి వరకు 52వేల ఎకరాల్లో రొయ్యల సాగు జరిగినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ ఏడాది 37,500 ఎకరాల్లో మాత్రమే రొయ్యల సాగు చేస్తున్నట్లు మత్స్యశాఖ అధికారులు అంచనా. కానీ అనధికారికంగా అసైన్డ్ భూముల్లో మరో 25వేల ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతోంది. ఏటా జిల్లాలో 2.52 లక్షల టన్నుల రొయ్యల ఉత్పత్తి అవుతోంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆక్వా జోన్‌లో పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉన్న భూములకే విద్యుత్ సబ్సిడీని ఇస్తామని ఆంక్షలు పెట్టింది. తీర ప్రాంతంలో అసైన్డ్ భూములే అధికంగా ఉన్నాయి. ఈ భూములకు సాగు నీటి లభ్యత, వేరే పంటలు సాగు చేసే అవకాశం లేకపోవడంతో రొయ్యల చెరువులను సాగు చేస్తున్నారు. గతంలో అసైన్డ్ భూముల్లో సాగు చేసే రొయ్యల చెరువులకు కూడా విద్యుత్ సబ్సిడీ ఇచ్చేవారు. ఆక్వా జోన్ అంశం తెరపైకి వచ్చాక అసైన్డ్ భూముల్లో సాగు చేసే రొయ్యల చెరువులకు విద్యుత్‌పై రాయితీని ఎత్తివేశారు. దీంతో రైతులకు కష్టాలు ప్రారంభ మయ్యాయి. పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్న భూములనే ఆక్వాజోన్ పరిధిలోకి తెచ్చి 10 ఎకరాల్లోపు రొయ్యల చెరువులకు ఉన్న 4,344 కనెక్షన్లకు మాత్రమే విద్యుత్ రాయితీని ప్రస్తుతం ఇస్తున్నారు. ఆక్వాజోన్ నుంచి అసైన్డ్ భూములను తప్పించి విద్యుత్ రాయితీని ఎత్తివేయడంతో ఈ తరహా భూముల్లో రొయ్యల సాగు చేస్తున్న ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ అందని ద్రాక్షగా మారింది.

రెండేళ్ల పాటు అభ్యర్థించినా పట్టించుకోని నాటి పాలకులు!

రొయ్యల సాగు చేసే అధికశాతం భూములను గత వైసీపీ ప్రభుత్వంలో ఆక్వా జోన్ నుంచి వివిధ కారణాలతో మినహాయించారు. దీంతో రైతులు గొడవ చేస్తే ఏడాదిన్నర కిందట సముద్రతీరం వెంబడి మండలాల్లో పనిచేసే వీఆర్వోలను కలెక్టరేట్‌కు పిలిపించి ఆక్వాజోన్ పరిధిలోకి కొంత భూమిని చేర్చామని ప్రకటించారు. అయినా అసైన్డ్ భూముల్లో సాగులో ఉన్న రొయ్యల చెరువులు, పట్టా భూములను ఆక్వాజోన్ పరిధిలోకి పూర్తిస్థాయిలో చేర్చనేలేదు. మత్స్యశాఖ, విద్యుత్‌శాఖ, రెవెన్యూశాఖ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో ఈ ప్రక్రియ నామమాత్రంగానే సాగింది. రొయ్యల సాగు జరుగుతున్న చెరువులను ఆక్వా జోన్‌లో చేర్చాలని, చేర్చకపోవడంతో విద్యుత్ రాయితీ అందడం లేదని రైతులు గతంలో శాసనసభ్యుల చుట్టూ నెలల తరబడి తిరిగినా ఫలితంలేదు.

రూ.50 వేల విద్యుత్ బిల్లు రూ.1.60 లక్షలు అయ్యింది

రొయ్యల చెరువులకు సంబంధించి యూనిట్‌కు విద్యుత్ బిల్లుగా రూ.3.84 చొప్పున, అదనపు చార్జీల పేరుతో మరో ఐదుపైసలను చేర్చి యూనిట్‌కు రూ.3.90 చొప్పున వసూలు చేసేవారు. 100 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా 10 ఎకరాలకు విద్యుత్‌ను వాడుకుంటే ఒక్కో యూనిట్‌కు రూ.2.35 రాయితీగా వచ్చేది. రాయితీ పోనూ రైతులు నెలకు రూ.50 వేల నుంచి 60 వేల వరకు విద్యుత్ బిల్లులను చెల్లించేవారు. ఆక్వా జోన్‌లో భూమి నమోదు కాలేదనే కారణంతో విద్యుత్ రాయితీని ఎత్తివేయడంతో 100 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ వాడుకున్నందుకు నెలకు రూ.1.50 లక్షల వరకు విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. విద్యుత్‌రాయితీ లేకపోవడంతో యూనిట్‌కు అన్ని ఖర్చులు కలుపుకుని రూ.6 వరకు విద్యుత్ బిల్లుగా చెల్లించాల్సి వస్తోంది. నెలకు లక్ష రూపాయలకు పైగా అదనంగా విద్యుత్ బిల్లుల రూపంలో చెల్లింపులు చేయాల్సి రావడంతో రైతులపై పెనుభారం పడుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఆక్వా జోన్ పరిధితో సంబంధంలేకుండా విద్యుత్ రాయితీలు ఇస్తామనడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

తగ్గిన రొయ్యల సాగు

మచిలీపట్నం మండలం పెదపట్నం, కానూరు గ్రామాలు సముద్రం పక్కనే ఉంటాయి. స్వచ్ఛమైన సముద్రపు నీరు డ్రైనేజీల ద్వారా రొయ్యల చెరువులకు అందుబాటులో ఉండటంతో ఈ ప్రాంతంలో రొయ్యల సాగు చేస్తే రైతులకు లాభాలు వచ్చేవి. దీంతో ఎకరం రొయ్యల చెరువుకు ఏడాదికి రూ.70 వేల నుంచి లక్షరూపాయల వరకు లీజు రూపంలో భూమి యజమానులకు వచ్చేది. భీమవరం తదితర ఆక్వాసాగులో పూర్తిస్థాయి అనుభవం ఉన్న జిల్లాలకు చెందిన రైతులు ఈ ప్రాంతంలో రొయ్యల చెరువులను పోటీపడి మరీ లీజుకు తీసుకుని సాగుచేసేవారు. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో ఈ ప్రాంతంలోని రొయ్యల చెరువులకు విద్యుత్ చార్జీలను యూనిట్‌కు రూ.1.50 వసూలు చేసేవారు. దీంతో అధిక విస్తీర్ణంలో రొయ్యల చెరువుల సాగు ఇక్కడ జరిగేది. ఈ రెండు గ్రామాల్లోని అధికశాతం భూములను ఆక్వాజోన్ పరిధి నుంచి తొలగించిన అనంతరం రొయ్యల చెరువులకు, నెలకు లక్షల్లో విద్యుత్ బిల్లులు వస్తుండటంతో రొయ్యల చెరువులను లీజుకు తీసుకునేందుకు రైతులు ముందుకురావడం లేదు. దీంతో భూమి యజమానులకు లీజు రూపంలో వచ్చే ఆదాయానికి గండిపడింది. మచిలీపట్నం మండలంలోని పెదయాదర, బోగిరెడ్డిపల్లి, కొత్తపల్లెతుమ్మలపాలెం, మోపిదేవి మండలంలోని పెదకళ్లేపల్లి, కోడూరు మండలంలోని హంసలదీవి, ఉల్లిపాలెం, రామకృష్ణాపురం, పిట్టల్లంక తదితర గ్రామాల్లో కృష్ణానదికి, కరకట్టకు మధ్యన ఉన్న లంకభూముల్లో రొయ్యల సాగు జరిగేది. లంకభూములను ఆక్వాజోన్ నుంచి తొలగించడంతో విద్యుత్ చార్జీలు అధికమైన నేపథ్యంతో ఈ భూముల్లోనూ రొయ్యల సాగును రైతులు గణనీయంగా తగ్గించారు.

లభించని నాణ్యమైన సీడ్

రొయ్యల సాగులో విత్తనం(సీడ్) ఎంపిక కీలకం. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఉన్న హేచరీల నుంచి ఉత్పత్తి అయ్యే సీడ్ గత రెండు సంవత్సరాలుగా నాణ్యతతో ఉండటం లేదని రైతులు చెబుతున్నారు. తల్లి రొయ్యలు(బ్రూడర్) నుంచి 10సార్లు విత్తనం తీస్తే నాణ్యతతో ఉంటుందని, అంతటితో ఆగకుండా హేచరీల యాజమానులు బ్రూడర్‌ల నుంచి 15 సార్లు విత్తనం తీస్తున్నారని రైతులు అంటున్నారు. బ్రూడర్‌లు బలహీనపడిన తర్వాత వాటి నుంచి పరిమితికి మించి విత్తనం తీయడంతో నాణ్యమైనసీడ్ ఉత్పత్తి కావడం లేదని రైతులు చెబుతున్నారు. ఈ తరహా సీడ్ తీసుకువచ్చి చెరువుల్లో వేస్తే 50 రోజులకే రొయ్యలకు వైట్‌కట్, మొప్పతెగులు, ఇతరత్రా వ్యాధులు సోకి చెరువులు పట్టుబడి చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. దీంతో రొయ్యల సాగులో పెట్టుబడి కూడా రాక నష్టాలబాట పడుతున్నామని ఆక్వారైతులు అంటున్నారు. రొయ్యలసీడ్ పరిస్థితి ఇలాఉంటే, మేత ధరలు అమాంతం పెరిగాయని రైతులు చెబుతున్నారు. గతంలో టన్ను మేతధర రూ.75 వేలుగా ఉంటే నేడు రూ.95వేలకు చేరింది. రొయ్యల మేతలో ఉపయోగించే తవుడు, జొన్నలు, సోయా, ఎండుచేపలు తదితర ముడిసరుకుల ధరలు పెరగడంతో మేతధరలు పెరిగాయని, ఈ సీజన్‌లో మరింతగా ధరలు పెంచుతామని ఫీడ్ మిల్లుల యజమానులు ఇప్పటికే సంకేతాలు పంపారని ఆక్వా రైతులు అంటున్నారు.

బ్లేడుతో పీక కోసి భర్త హత్య

అనుమానంతో భార్య ఘాతుకం

- గుడివాడ పట్టణంలో సంచలనం రేపిన ఘటన





హత్యకు గురైన చిన్న

గుడివాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అనుమానం పెనుభూతమై భర్త పీకను బ్లేడ్‌తో కోసి హత్య చేసిన ఘటన గుడివాడలో సంచలనం రేపింది. వివరాల్లోకి వెళితే... గుడివాడ పట్టణం రైలుపేటకు చెందిన కత్తి చిన్న, జ్యోతి భార్యభర్తలు. వీరిద్దరూ ఐదు చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. కుమార్తెలు ఇరువురు ఉయ్యూరులోని ప్రభుత్వ వసతిగృహంలో ఉండి చదువుకుంటున్నారు. గత కొంతకాలంగా ఒకరిపై ఒకరు అనుమానంతో విడివిడిగా ఉంటూ జీవిస్తున్నారు. మంగళవారం ఒక కేసు నిమిత్తం గుడివాడ కోర్టుకు హాజరయ్యే క్రమంలో భార్యభర్తలు కలిశారు. కోర్టు పనుల అనంతరం చిన్న తన భార్య జ్యోతి, కుమారుడిని రైలుపేటలోని ఇంటికి తీసుకువచ్చాడు. ఇద్దరి మధ్య మాట మాట పెరగడంతో కోపంతో భార్య జ్యోతి బ్లేడుతో భర్త చిన్న పీకను కోసేసింది. దీంతో చిన్న అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం కుమారుడి తీసుకుని జ్యోతి పరారైంది. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

మిర్చి రైతుకు ధరాఘాతం!

8లో

నేడు 109 పాఠశాలల్లో సామర్థ్య పరీక్ష



గన్నవరంలోని రవాణాశాఖ ఫిట్‌మెంట్ సెంటర్లో తుప్పుపట్టిన స్థితిలో క్రేన్లు

తుప్పు పట్టించారు..!

రోడ్డుపై మొరాయించిన వాహనాల తొలగింపునకు 2 భారీ క్రేన్లు ఇచ్చిన కేంద్రం

8 ఏళ్లుగా వినియోగించుకుండా మూలనపడేసిన రవాణాశాఖ

- వీఐపీ కారిడార్‌లో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం
- క్లియర్ చేయలేక అల్లాడుతున్న ట్రాఫిక్ పోలీసులు
- క్రేన్లు కావాలని కలెక్టర్‌కు ఇటీవల డీసీపీ విజ్ఞప్తి
- ఆ 2 క్రేన్లను వినియోగంలోకి తెస్తే తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

జాతీయ రహదారులు, వీఐపీ కారిడార్‌లో వాహనాలు మొరాయించినప్పుడు ట్రాఫిక్ క్లియర్ చేయడంలో కీలకపాత్ర పోషించే భారీ క్రేన్లు రవాణాశాఖ అధికారుల నిర్లక్ష్యానికి గురయ్యాయి. కేంద్రం నుంచి ఎనిమిదేళ్ల కిందటే మంజూరైనా నేటికీ వినియోగానికి నోచుకోక తుప్పుపట్టిపోయాయి. వీఐపీ కారిడార్‌లో తరచూ ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలకు కోట్ల రూపాయల విలువైన ఈ క్రేన్లతో చెక్ పెట్టవచ్చునని పలువురు అభిప్రాయపడుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ నగరం మీదుగా వెళ్లే జాతీయ రహదారులపై జరుగుతున్న వాహన ప్రమాదాలు, వాహనాల మొరాయింపుల వల్ల తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. సాధారణంగానే నగర రహదార్లపై ట్రాఫిక్ రద్దీ విపరీతంగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో యాక్సిడెంట్ అయిన వాహనాలను, మొరాయించిన వాహనాలను తొలగించడం శక్తికి మించినపని అవుతోంది. దీంతో వీఐపీ కారిడార్‌లో విమానాశ్రయం నుంచి వచ్చే అతిథుల వాహనాలు ట్రాఫిక్ చక్రబంధంలో మిగతా 8లో..

ఐఆర్‌సీటీసీ బాట్లింగ్ ప్లాంట్‌లో వార్!



- సివిల్, ఫ్యాబ్రికేషన్స్ పనులు చేయించుకుని రూ. 37.52 లక్షలు ఎగ్గొట్టిందని ఆరోపణ
- మెహాయ్ ఆక్వాకు రూ. 1.50 కోట్ల చెల్లింపులు నిలుపుదల చేసిన ఐఆర్‌సీటీసీ
- ధనలక్ష్మీ నుంచి క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకోవాలని మెలిక

మెహాయ్ ఆక్వాపై ధనలక్ష్మీ ఫ్యాబ్రటన్స్ ఫిర్యాదు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మల్లవల్లిలోని రైల్‌నీర్ బాట్లింగ్ ప్లాంట్‌లో సివిల్, ఫ్యాబ్రికేషన్ పనులు చేయించుకుని లక్షల రూపాయల డబ్బులను ఎగ్గొట్టిందని 'మెహాయ్ ఆక్వా' సంస్థపై ఐఆర్‌సీటీసీ ఉన్నతాధికారులకు కాంట్రాక్టు సంస్థ 'ధనలక్ష్మీ ఫ్యాబ్రటన్స్' యాజమాన్యం ఫిర్యాదు చేసింది. న్యూఢిల్లీలోని ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) రైల్‌నీర్ విభాగాధిపతి అయిన జీజీఎంకు ధనలక్ష్మీ ఫ్యాబ్రటన్స్ తరఫున ఏ.కాశేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ఐర్‌సీటీసీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా మల్లవల్లిలో తలపెట్టిన రైల్‌నీర్ బాట్లింగ్ ప్లాంట్‌ను 'మెహాయ్ ఆక్వా' సంస్థ నిర్వహిస్తోంది. ఈ సంస్థ తమ ప్లాంట్‌లో సివిల్, ఫ్యాబ్రికేషన్ పనులను ధనలక్ష్మీ ఫ్యాబ్రటన్స్ అనే సంస్థకు కాంట్రాక్టు ఇచ్చింది. కాంట్రాక్టు సంస్థకు రూ.37.52 లక్షల మేర బిల్లులు చెల్లించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. దీనిపై మెహాయ్ సంస్థను అడగగా తమకు సంబంధం లేదని బుకాయించటంతో వివాదం మొదలైంది. కొంతమంది ప్రైవేటు వ్యక్తులు దూషణలు, దాడులకు తెగపడటంతో రెండు కాంట్రాక్టు సంస్థల మధ్య వివాదానికి దారి తీసింది. మల్లవల్లి బాట్లింగ్ ప్లాంట్‌లో సివిల్ , ఫ్యాబ్రికేషన్స్ పనులు చేపట్టిన ధనలక్ష్మీ ఫ్యాబ్రటన్స్ సంస్థ ఐఆర్‌సీటీసీ హెడ్ ఆఫీసుకు ఈ అంశంపై ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు కంటే ముందు వీరవల్లి పోలీసు స్టేషన్‌లో కూడా మెహాయ్ ఆక్వాపై, ఓ ప్రైవేటు వ్యక్తి పైనా ఫిర్యాదు చేసింది. మెహాయ్ ఆక్వా బిల్లు చెల్లింపులు జరపకపోగా ఓ ప్రైవేటు వ్యక్తితో తమపై దాడి చేయించే ప్రయత్నం చేసిందని ఆరోపిస్తూ ధనలక్ష్మీ ఫ్యాబ్రటన్స్ సంస్థ పోలీసు కేసు పెట్టింది.

ఫిర్యాదుపై స్పందించిన ఐఆర్‌సీటీసీ అధికారులు

ఈ కేసు పూర్వాపరాలు ఎలా ఉన్నా తాజాగా ధనలక్ష్మీ సంస్థ మళ్లీ ఢిల్లీలోని ఐఆర్‌సీటీసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయటంతో సంచలనంగా మారింది. ఈ ఫిర్యాదుపై ఐఆర్‌సీటీసీ అధికారులు కూడా స్పందించారు. మెహాయ్ ఆక్వాకు ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి చెల్లించాల్సిన బ్యాలెన్స్ రూ.1.50 కోట్లను ఐఆర్‌సీటీసీ నిలిపివేసింది. దీంతో పాటు ధనలక్ష్మీ ఫ్యాబ్రటన్స్ సంస్థ నుంచి క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకోవాల్సిందిగా ఆదేశించింది. ధనలక్ష్మీ ఫ్యాబ్రటన్స్ క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇస్తేనే ఉత్పాదకతను ప్రారంభించాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం క్లియరెన్స్ సర్టిఫికెట్ లేకుండా ప్రారంభించటానికి వీలు లేదు. తనకు రావాల్సిన రూ.1.50 కోట్లను ఐఆర్‌సీటీసీ నిలిపివేయటంతో వాటి చెల్లింపులు జరపాలని మెహాయ్ సంస్థ ఐఆర్‌సీటీసీపై ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. కాంట్రాక్టు సంస్థకు డబ్బులు చెల్లించి క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకోమని చెప్పినట్టుగా తెలుస్తోంది. క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇవ్వాలంటే ఆ సంస్థకు పెండింగ్ బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. తన దగ్గర డబ్బులు లేవని, మీరు ఆపివేసిన డబ్బులు ఇస్తేనే చెల్లించగలనని 'మెహాయ్ ఆక్వా' చెప్పినట్టుగా తెలుస్తోంది. దీనిపై ఐఆర్‌సీటీసీ కూడా తెలివిగా వ్యవహరించింది. ముందుగా పార్ట్ పేమెంట్ విడుదల చేస్తామని .. ఆ సంస్థకు చెల్లింపులు జరపాల్సిందిగా నిర్దేశించింది. దీనికి సంబంధించి ప్రస్తుతం ప్రక్రియ నడుస్తున్నట్టు తెలుస్తోంది. రెండు సంస్థల మధ్యన తలెత్తిన వివాదాన్ని ఐఆర్‌సీటీసీ చాలా తెలివిగానే పరిష్కరిస్తోంది. ఈ వివాదానికి కూడా థర్డ్‌పార్టీ వ్యక్తులే కారణమని తెలుస్తోంది. ప్లాంట్‌లో థర్డ్ పార్టీ వ్యక్తులు తమపై దాడికి పాల్పడ్డారని, తీవ్రంగా దూషించారని కూడా ఆ సంస్థ ఫిర్యాదులో పేర్కొనటాన్ని బట్టి చూస్తే మెహాయ్ ఆక్వా, ధనలక్ష్మీ ఫ్యాబ్రటన్స్ సంస్థల మధ్య వివాదానికి కూడా కారణం వీరేనని తెలుస్తోంది. తమను మెహాయ్ ఆక్వా సంస్థ మోసం చేస్తే సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌ను ఆశ్రయిస్తామని ధనలక్ష్మీ ఫ్యాబ్రటన్స్ యాజమాన్యం చెబుతోంది.



అధికారులతో సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు

కృష్ణలంక, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పత్తి రైతులకు కనీస మద్దతు ధర కల్పించే విధంగా జిల్లాలో ఐదు వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో 14 జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ పత్తి కొనుగోళ్లు ప్రారంభించిందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ప్రజాప్రతినిధుల అభ్యర్థన, రైతుల సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకొని బుధవారం నుంచి జగ్గయ్యపేట, కంచికచర్ల, నందిగామ, మైలవరం, మార్కెట్ యార్డుల్లోను కొనుగోళ్లు జరగనున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో నందిగామ, మైలవరం, కంచికచర్ల, జగ్గయ్యపేట, తిరువూరు మండలాల్లో ప్రధానంగా పత్తిని రైతులు పండిస్తున్నారన్నారు. దీనిలో భాగంగా నోటిఫై చేసిన జిన్నింగ్ మిల్లులతో పాటు ఈనెల 4వ తేదీ బుధవారం నుంచే కొనుగోళ్లు ప్రారంభించాలని స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించినట్టు తెలిపారు. క్వింటాకు సీసీఐ నిర్ణయించిన కనీస మద్దతు ధర రూ.7521కు కొనుగోలు చేయాలన్నారు. పత్తిని ప్లాస్టిక్ సంచుల్లో కాకుండా లూజు, గన్నీ బ్యాగులలో కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. రైతులు తమ పంటను మార్కెట్ యార్డులో విక్రయించుకొనేందుకు వ్యవసాయ మార్కెట్‌కమిటీ కార్యదర్శి నందిగామ (9182361191), మైలవరం (9182361471), కంచికచర్ల (9182361472), జగ్గయ్యపేట (9182361470)లో సంప్రదించవచ్చని సూచించారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ జేడీ కె.శ్రీనివాసరావు, సీసీఐ అసిస్టెంట్ మేనేజర్ హెచ్.రామప్రసాద్, మార్కెటింగ్ డీడీ పి.లావణ్య, ఏడీ కె.మంగమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, మార్కెటింగ్ కమిటీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మోపిదేవిలో ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

రైతులు ఆందోళన చెందొద్దు..

- ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది
- ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

మోపిదేవి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి సాగు చేసి యంత్రాల ద్వారా నూర్పిడి చేపట్టిన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో ఏర్పడిన నిర్లిప్తతపై మంగళవారం మోపిదేవి తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ, రెవెన్యూ, మిల్లుల యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో ఏయే గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు ఆలస్యమవుతున్నది, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గంలో ఇప్పటి వరకు 1288 మంది రైతుల నుంచి 9426.6 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.19 కోట్లు చెల్లించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. తుఫాన్ ప్రభావం, భారీ వర్షాల ముందస్తు సమాచారంతో రైతులు యంత్రాల ద్వారా ఒకేసారి నూర్పిడి చేయటం జరిగిందన్నారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. 1318, 1262 వంటి ఏ రకం ధాన్యాన్ని అయినా ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిందిగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీవిద్య, ఏవో హెబ్సిబా రాణి, మండలి వెంకట్రామ్, రావి రత్నగిరి, నాదెండ్ల శరత్ చంద్రబాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉప్పులేటి దేవీ ప్రసాద్

వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం!

- అఖిల భారత మాలసంఘాల జేఏసీ

అవనిగడ్డ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమని, ఇది ఎస్సీ వర్గాల మధ్య అనైక్యతను సృష్టించేదిలా ఉందని విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి, అఖిల భారత మాలసంఘాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవీ ప్రసాద్ ఆరోపించారు. మంగళవారం సాయంత్రం అవనిగడ్డలోని ఏ1 మార్ట్ సమావేశం హాలులో మాలల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు ఎస్సీలకు వ్యతిరేకమని, 59 కులాలు ఈ తీర్పు వల్ల నష్టపోతాయన్నారు. క్రిమీలేయర్ విధానాన్ని అమలు చేయాలని చెప్పటం మాదిగలతో సహా ఎస్సీలందరికీ నష్టమే అన్నారు. దేశంలో 22 శాతం ఎస్సీ జనాభా ఉంటే కేవలం 15 శాతం మాత్రమే రిజర్వేషన్లు కల్పిస్తున్నారని, దానిని 22 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. దేశంలో 23 రాష్ట్రాలు వర్గీకరణను వ్యతిరేకిస్తుంటే తెలుగు రాష్ట్రాలు మాత్రం వర్గీకరణ అమలుకు సిద్ధపడుతున్నాయన్నారు. ఈ నెల 15న వర్గీకరణకు వ్యతిరేకంగా గుంటూరులోని నల్లపాడు వద్ద జరిగే మాలల మహాగర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంతగాని రమేష్, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్దన్, పుల్లగోరు రాజేంద్ర, జైభీమ్ భారత్‌పార్టీ నియోజకవర్గ కన్వీనర్ సముద్రాల అంబేడ్కర్, కర్రా సుధాకర్, మాలమహానాడు సంఘాల నేతలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

జి.కొండూరు/విస్సన్నపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జి.కొండూరు మండలం చెవుటూరు గ్రామంలో ఓ గృహంలో నిఖిల్ అనే వ్యక్తి అక్రమంగా దాచిన 8.5 టన్నుల పీడీఎస్ రైస్‌ను పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకొని పీడీఎస్ డీటీ మాధవిలతకు అప్పగించారు. నిఖిల్‌పై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.



విస్సన్నపేటలో రేషన్ షాపు తనిఖీ

● విస్సన్నపేటలో మంగళవారం పీడీఎస్ అధికారులు రేషన్ దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో షాపు నంబరు 1, 2లలో బియ్యం అధికంగా ఉండటాన్ని గుర్తించారు. 1 షాపులో 69 క్వింటాళ్లు, రెండో షాపులో 9.40 క్వింటాళ్లు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు డీటీ నాగరాజు తెలిపారు.

7న పాఠశాలల్లో పెద్ద పండుగ

- తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల మెగా సమావేశం
- విద్యార్థుల వికాసం, సమస్యల పరిష్కారానికి దిక్సూచి
- కార్యక్రమ విజయవంతానికి పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం ఈనెల 7న పాఠశాల విద్యావ్యవస్థకే అతిపెద్ద పండుగ.. మెగా తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాన్ని (మెగా పీటీఎం) నిర్వహించనుందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విద్యాశాఖ, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశ జిల్లా పాఠశాల విద్యాశాఖ అధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ (ఎంపీటీఎస్) సన్నద్ధతపై ఎంఈవోలతో పాటు వివిధ శాఖల అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశం పాఠశాలల పటిష్టత, విద్యార్థి వికాసం, సమస్యల పరిష్కారానికి దిక్సూచిగా నిలుస్తుందన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య ఆత్మీయ వారధిని నిర్మిస్తుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, దాతలు, పూర్వవిద్యార్థులు తదితరులు కార్యక్రమానికి హాజరవుతారని, తద్వారా పిల్లల చదువు, ప్రవర్తన, క్రమశిక్షణ తదితర వివరాలను తల్లిదండ్రులు తెలుసుకోవచ్చన్నారు. ఇంతటి ప్రాధాన్యమున్న కార్యక్రమానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. పారిశుధ్యం, ఆవరణ సుందరీకరణ, సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమ నిర్వహణ, నిరంతర విద్యుత్‌సరఫరా, హోలిస్టిక్ ప్రోగ్రెస్ రిపోర్టుల పంపిణీ, ఆరోగ్య బుక్‌లెట్ల పంపిణీ, అతిథులు, తల్లిదండ్రులకు ఆహ్వానం తదితరాలకు చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయాలకు అతీతంగా కార్యక్రమాన్ని నిర్వహించాలన్న ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రజాప్రతినిధులు పార్టీ జెండాలు, కండువాలు, రంగులు వేసుకుని రావద్దని విజ్ఞప్తి చేయాలని సూచించారు. తల్లిదండ్రులకు ఆహ్వానం పలకడం దగ్గర నుంచి కామన్ లంచ్ వరకు ప్రతి కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారం సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఏపీ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం రూపొందించిన పదో తరగతి పీఎస్ ప్రశ్నల నిధిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈవో యూవీ సుబ్బారావు, డీసీపీ ఎం.కృష్ణమూర్తి నాయుడు, వీఎంసీ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జి.మహేశ్వరరావు, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, తిరువూరు ఆర్డీవో కె.మాధురి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీపీవో పి.లావణ్య కుమారి తదితరులు పాల్గొన్నారు.



పరీక్షల నిర్వహణాధికారులతో మాట్లాడుతున్న డీఈవో రామారావు

నేడు 109 పాఠశాలల్లో విద్యార్థులకు పరీక్ష

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలో ఎంపిక చేసిన 109 పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు సామర్థ్యాధారిత పరీక్షలు బుధవారం నిర్వహించనున్నట్టు డీఈవో పీవీజే రామారావు పేర్కొన్నారు. పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో మంగళవారం అబ్జర్వర్లు, ఇన్విజిలేటర్లతో పరీక్షల ఏర్పాట్లపై డీఈవో మాట్లాడారు. నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా పరక్ పేరుతో నిర్వహిస్తున్న సామర్థ్యాధారిత పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. 109 పాఠశాలల్లో 123 సెక్షన్లలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. వివిధ సబ్జెక్టుల్లో విద్యార్థుల సామర్థ్యం ఎంతవరకు ఉందో బేరీజు వేసేందుకు ఈ పరీక్షలు దోహదపడతాయన్నారు. జిల్లా అబ్జర్వర్ మాధురి, సీఈ బోర్డు సెక్రటరీ షేక్ జాన్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో రికార్డులు సృష్టించాలి

మచిలీపట్నం టౌన్ : విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే సునాయాసంగా విజయాలు సాధించవచ్చని డీఈవో పీవీజే రామారావు అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చిలకలపూడి మునిసిపల్ హైస్కూల్‌లో మంగళవారం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు మెడల్స్, నవరత్నాలు పేరిట మానవత విద్యా కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ, పదో తరగతి విద్యార్థులకు జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో నూరురోజుల ప్రణాళిక అమలు జరుగుతోందన్నారు. విద్యార్థులకు త్వరలో స్టడీ మెటీరీయల్ అందజేస్తామన్నారు. మోటివేషనల్ స్పీకర్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు, స్టార్ విద్యా సంస్థల మెంటార్ శ్రీరామ్ మాట్లాడుతూ, విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆదిత్య, హెచ్‌ఎం కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రిగ్ మెమోరియల్ ఆటల పోటీలపై సమీక్ష

మచిలీపట్నం టౌన్ : కృష్ణాజిల్లా గ్రిగ్ మెమోరియల్ ఆటల పోటీలపై మంగళవారం డీఈవో కార్యాలయంలో డీఈవో రామారావు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మచిలీపట్నం సబ్‌జోన్ పోటీలు తాళ్లపాలెం, పెడన బాలుర సబ్‌జోన్ సంగమూడి, బాలికల సబ్‌జోన్ గూడూరులో, గుడివాడ సబ్‌జోన్ ఎన్టీఆర్ స్టేడియం, పామర్రు సబ్‌జోన్ పమిడిముక్కల, గన్నవరం బాలుర సబ్‌జోన్ గన్నవరం జిల్లా పరిషత్, బాలికల సబ్‌జోన్ గన్నవరం బాలికల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించాలన్నారు. పెనమలూరు సబ్‌జోన్ ఈడుపుగల్లులో బాలుర, ఆకునూరులో బాలికలకు జరుగుతాయన్నారు. అవనిగడ్డ బాలుర తలగడదీవిలో, బాలికలకు లింగారెడ్డిపాలెంలో నిర్వహించాలన్నారు. బాలుర సెంట్రల్ జోన్ పోటీలు ఘంటసాల మండలం గోగినేనిపాలెంలో నిర్వహించాలన్నారు.

విధుల్లోకి అసిస్టెంట్ డైరెక్టర్లు

మచిలీపట్నం టౌన్ : బదిలీల్లో భాగంగా కృష్ణా విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం ఇద్దరు అసిస్టెంట్ డైరక్టర్లు సయ్యద్ అబ్దుల్ రవూఫ్, మద్దుల విద్యాలతలు విధుల్లో చేరారు. వీరు సమగ్ర శిక్ష కార్యాలయంలో పనిచేస్తున్నారు. ఇక్కడ అసిస్టెంట్ డైరక్టర్లుగా పనిచేస్తున్న ఎండీ అజీజ్, మనోహర్ నాయక్‌లు సమగ్ర శిక్ష కార్యాలయానికి బదిలీఅయ్యారు. బాధ్యతలు చేపట్టిన అసిస్టెంట్ డైరక్టర్లు డీఈవో రామారావును కలిసి రిపోర్టు చేసారు.

తుప్పు పట్టించారు..!

(7వ పేజీ తరువాయి)

చిక్కుకుపోతున్నాయి. వీన్ని క్లియర్ చేయడానికి రెండు క్రేన్లు కావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశను విజయవాడ ట్రాఫిక్ డీసీపీ ఎం.కృష్ణమూర్తినాయుడు తాజాగా అభ్యర్థించటంతో వినియోగంలోలేని క్రేన్ల అంశం చర్చనీయాంశంగా మారింది.

డీఆర్‌సీ సమావేశంలో ట్రాఫిక్ రచ్చ

అమరావతి రాజధానికి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాజమార్గంగా ఉన్న వీవీపీ కారిడార్‌పై ట్రాఫిక్ సమస్యల అంశం ఇటీవల జరిగిన డీఆర్‌సీ సమావేశాన్ని కుదిపేసింది. ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో పదహారవ నంబర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ - 16)పై గన్నవరంలోని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కనకదుర్గవారధి వరకు 'వీవీపీ కారిడార్‌'గా ఉన్న మార్గంలో తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశకు విజయవాడ పోలీసు కమిషనరేట్ ట్రాఫిక్ జోన్ డీసీపీ ఎం.కృష్ణమూర్తి నాయుడు మొరపెట్టుకున్నారు. వీవీపీ కారిడార్ మార్గం నాలుగు వరసలుగా మాత్రమే ఉండటం, ఎగువన చిన్న అవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు విజయవాడ పశ్చిమ బైపాస్ ఇంకా పూర్తి కాకపోవటం వంటి అంశాలను ఆయన ఏకరువు పెట్టారు. దేశ ప్రధాని, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు, వీవీఐపీలు, వీఐపీలు, విదేశీ అతిథులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలంతా అమరావతి రాజధానికి రావటానికి గన్నవరంలోని విజయవాడ విమానాశ్రయానికి వస్తున్నారని.. నాలుగు వరుసలుగా ఉన్న వీవీపీ కారిడార్‌లో భారీ వాహనాలు తిరుగుతున్న కారణంగా ప్రమాదాలు తలెత్తిన సందర్భంలో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోందని చెప్పారు. వీవీపీ కారిడార్‌లో ప్రయాణం నరకప్రాయంగా మారుతోందన్న అంశాన్ని డీసీపీ స్పష్టం చేశారు. రోడ్ల మీద ఆగిపోయిన లారీలను కానీ, ప్రమాదానికి గురైన వాహనాలను కానీ తొలగించాలంటే కష్టమైపోతుందని, క్రేన్లు కూడా తమ దగ్గర లేవని ఆవేదన వ్యక్తం చేశారు. వీవీపీ కారిడార్‌లో సిటీ వెలుపల ఒక క్రేన్, సిటీ లిమిట్‌లో మరో క్రేన్ చొప్పున రెండు క్రేన్లు అవసరమని, వాటిని సమకూర్చి పెట్టాల్సిందిగా అభ్యర్థించారు. దీనిపై కలెక్టర్ లక్ష్మీశ పరిశీలిస్తామన్నారు.

ఎనిమిదేళ్ల కిందటే కేంద్రం నుంచి వచ్చిన క్రేన్లు



క్రేన్లు కొనాలంటే భారీ బడ్జెట్ కేటాయించాలి. దీని మీదనే పోలీసు, జిల్లా అధికార యంత్రాంగాలు ఆలోచిస్తున్నాయి. కానీ రెండు క్రేన్లు జిల్లాకు కేంద్రం ఎనిమిదేళ్ల కిందటే మంజూరు చేసింది. కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ అప్పట్లో ఉమ్మడి కృష్ణాజిల్లాకు కేంద్రంగా ఉన్న విజయవాడలోని రవాణా శాఖ కార్యాలయానికి రెండు భారీ క్రేన్లను అందించింది. కోట్ల రూపాయల వ్యయంతో కూడిన క్రేన్లను ఆపరేట్ చేయటానికి సిబ్బంది లేక, వాటిని నిర్వహించలేక కార్యాలయంలోనే చాలా కాలం వదిలేశారు. ఆ తర్వాత కాలంలో క్రేన్లను అలా వదిలివేయటంపై విమర్శలు వస్తుండటంతో.. వీటిని కాస్తా గన్నవరంలోని రవాణా శాఖ ఫిట్‌నెస్ సెంటర్‌కు పంపించి అక్కడ ఓ మూలన పడేశారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పు పట్టి ఉన్నాయి. ఎనిమిదేళ్లుగా వీటిని ఉపయోగించటం లేదు. ఈ క్రేన్లను కంపెనీకి పంపించి సర్వీసింగ్ చేయిస్తే ఇప్పటికైనా ఉపయోగించుకునే అవకాశం ఉంది. కలెక్టర్ లక్ష్మీశ చొరవ చూపి.. రవాణా శాఖ అధికారులతో చర్చించి.. అవసరమైతే స్వయంగా వాటిని పరిశీలించి పోలీసు శాఖకు అప్పగించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పీఎం జన ఔషధి కేంద్రాల ఏర్పాటుకు ఏం చర్యలు తీసుకున్నారు

- పార్లమెంటు సమావేశాల్లో ఎంపీ బాలశౌరి ప్రశ్న

మచిలీపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పీఎం జనఔషధి కేంద్రాల నిర్వహణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి మంగళవారం పార్లమెంటు సమావేశాల్లో ప్రశ్న లేవనెత్తారు. పీఏసీఎస్‌ల ద్వారా ఏర్పాటు చేసేందుకు తీసుకున్న చర్యలు, ఇప్పటివరకు ఎన్ని పీఏసీఎస్‌లనుంచి దరఖాస్తులు అందాయి, ఎన్నింటికి అనుమతులు, ఆర్థికసహకారం అందించారు, తదితర వివరాలు తెలియజేయాలని ఆయన కోరారు. కేంద్ర హోంశాఖ, సహకార శాఖల మంత్రి అమిత్‌షా రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. దేశంలోని 33 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని పీఏసీఎస్‌లనుంచి పీఎం జనఔషధి కేంద్రాల ఏర్పాటుకు 4,470 దరఖాస్తులు అందాయని తెలిపారు. ఏపీలోని 684పీఏసీఎస్‌ల నుంచి దరఖాస్తులు అందినట్టు తెలిపారు. వీటిద్వారా మందులు విక్రయించేందుకు ప్రత్యేకకోడ్‌ను ఇచ్చామని తెలిపారు. ఔషధి కేంద్రాలు కొనుగోలు చేసే మందులపై 20శాతం, లేదా నెలకు రూ.20వేల పరిమితిని మించకుండా ప్రోత్సాహం ఇవ్వడం జరుగుతుందన్నారు.

భూసార ఆరోగ్య పరీక్షా కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు అందలేదు

- కేంద్ర సహాయ మంత్రి భగీరథ్ చౌదరి

వన్‌టౌన్ : ఐదేళ్లుగా నూతన భూసార ఆరోగ్య పరీక్షా కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ నుంచి ఎటువంటి ప్రతిపాదనలు అందలేదని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయమంత్రి భగీరథ్ చౌదరి తెలిపారు. ఉపయోగం లేని భూసార ఆరోగ్య పరీక్షా కేంద్రాల పునరుద్ధరణపైనే ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఆయన పేర్కొన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర సహాయ మంత్రి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం ఏపీలో 47 స్థిర, 13 మొబైల్, 1,328 మినీ భూసార పరీక్షా కేంద్రాలు ఉన్నట్టు, ఐదేళ్లలో 4,76,519 మట్టి నమూనాలు పరీక్షించినట్టు ఆయన గణాంకాలు వెల్లడించారు. ఈ ఏడాది స్థిర భూసార పరీక్షా కేంద్రాల్లో 10వేలు, మొబైల్ పరీక్షా కేంద్రాల్లో 5వేలు, మినీ పరీక్షా కేంద్రాల్లో 3 వేల మట్టి నమూనాలు మాత్రమే పరీక్షించేందుకు అవకాశం ఉందని మంత్రి వెల్లడించారు.

ఎగుమతుల ప్రోత్సాహానికి నిధులు ఇవ్వలేదు

గత రెండేళ్లలో దేశవ్యాప్తంగా ఎగుమతుల హబ్ ప్రణాళిక కింద జిల్లాలకు ఎటువంటి ప్రోత్సాహక నిధులు ఇవ్వలేదని కేంద్ర వాణిజ్య పరిశ్రమల సహాయ మంత్రి జితిన్ ప్రసాద్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఎంపీలు కేశినేని శివనాథ్, దగ్గుమళ్ల ప్రసాదరావులు అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. జిల్లా స్థాయిల్లో రాష్ట్ర ఎగుమతుల ప్రోత్సాహక కమిటీలు, జిల్లా ఎగుమతుల ప్రోత్సాహక కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నట్టు తెలిపారు.

బాలికను మోసగించిన నిందితుడిపై పోక్సో కేసు నమోదు

బంటుమిల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బాలికకు మాయమాటలు చెప్పి తల్లిని చేసిన నిందితుడిపై బంటుమిల్లి పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాతులూరు హరిజనవాడకు చెందిన దరిసే వెంకటేశ్వరస్వామి(23)కి సమీప ప్రాంతానికి చెందిన బాలిక(18)తో ఏడాది క్రితం పరిచయం ఏర్పడింది. ఆ పరియంతో పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికను గర్భవతిని చేశాడు. సోమవారం మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రిలో బాలిక ఆడపిల్లకు జన్మనిచ్చింది. అనంతరం పెళ్లికి మొఖం చాటేయడంతో బాలిక తల్లి ఫిర్యాదు మేరకు వెంకటేశ్వరస్వామిపై పోక్సో, అత్యాచార చట్టాల కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు డీఎస్పీ అబ్దుల్ సుభాని తెలిపారు.

వీఓఏలను విధుల్లోకి తీసుకోవాలి

సెర్ప్ సీఈవోకు కాంగ్రెస్ వినతి

విజయవాడ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తొలగించిన గ్రామ సంఘ సహాయకురాళ్లను విధుల్లోకి తీసుకోవాలని కాంగ్రెస్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్ రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ సీఈఓ వీరపాండియన్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులుపై కక్ష కట్టి ఇబ్బందులకు గురి చేస్తే, కూటమి ప్రభుత్వం అదే పంథాలో నడుస్తుందని విమర్శించారు. ఎన్టీఆర్ జిల్లాలో జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాలలో సుమారుగా 150 మంది వరకు వీఓఏలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎటువంటి నోటీసు లేకుండా విధుల నుంచి తొలగించారన్నారు. దీనిపై అధికారులు, ఎమ్మెల్యేలను కలిసినా ఫలితం లేక పోయిందన్నారు. వారిని తక్షణం విధుల్లోకి తీసుకోవాలన్నారు.

మిర్చి రైతుకు ధరాఘాతం!

పంట ఆశాజనకం.. మార్కెట్లో గిట్టుబాటుకాని ధర.. లక్షల్లో నష్టం

ఈ ఏడాది మార్చి నెలలో కల్లంలో ఉన్న తేజ రకం మిర్చి క్వింటా రూ. 21 వేలకు ధర పలికినప్పటికీ పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతాలకు చెందిన రైతు కొమ్మినేని సత్యనారాయణ అమ్మలేదు. ఇంకా ధర పెరుగుతుందన్న ఆశతో శీతల గిడ్డంగిలో 70 క్వింటాళ్లు నిల్వ చేశాడు. ధర పెరగకపోగా దారుణంగా పడిపోయింది. నిస్సహాయ స్థితిలో రూ. 13 వేల వంతున అమ్మాడు. తగ్గిన ధరతో పాటు గిడ్డంగి ఖర్చులు కలిపి రూ.6 లక్షలకు పైగా రైతు నష్టపోయాడు. మార్కెట్ పతనం కావటంతో మిర్చి ఘాటు రైతుల నషాళానికంటింది.

(ఆంధ్రజ్యోతి - కంచికచర్ల)

మిర్చి ధర బాగా దిగజారింది. గత సీజన్‌తో పోల్చితే క్వింటాకు రూ.10 వేలకు పైగా ధర పడిపోయింది. ధర పెరుగుతుందన్న ఆశతో గత సీజన్ పంటను శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసిన రైతులు, మార్కెట్లో నెలకొన్న సంక్షోభం వల్ల తీవ్రంగా నష్టపోయారు. మార్కెట్లోకి కొత్త పంట వస్తున్న తరుణంలో ధర తగ్గటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది మార్చి నెలలో తేజ రకం మిర్చిని కల్లాల్లోనే వ్యాపారులు క్వింటా రూ. 21 వేల నుంచి రూ. 22 వేలకు అడిగారు. కొద్ది మంది తప్పితే ఎక్కువ మంది రైతులు ధర పెరుగుతుందన్న ఆశతో టిక్కీ రూ. 150ల ఖర్చుతో ఎక్కడికెక్కడ శీతల గిడ్డంగుల్లో నిల్వ చేశారు. సెప్టెంబరు నుంచి మార్కెట్ దిగజారటం ప్రారంభమైంది. రోజు రోజుకు ధర తగ్గుతోంది. ఇటీవల గుంటూరు యార్డులో తేజ రకం రూ.13 వేల నుంచి రూ.15 వేలు ధర పలకగా, బెస్ట్ క్వాలిటీకి రూ.16,500ల ధర వచ్చింది. 355 రకానికి రూ. 8 వేల నుంచి రూ. 13 వేలు, 341 రకానికి రూ. 10 వేల నుంచి రూ. 14 వేలు, నెం. 5 రకానికి రూ. 10 వేల నుంచి రూ. 13 వేలు, 5531 రకానికి రూ. 8 వేల నుంచి 11,500లు, ఆర్మూర్ రకానికి రూ. 9వేల నుంచి రూ. 12 వేలు, క్లాసిక్ రకానికి రూ. 9వేల నుంచి రూ. 11 వేల ధర పలికింది. దేశీయ అవసరాలకు తప్పితే ప్రధానంగా ఎగుమతులు లేనందున మిర్చి ధర పడిపోయిందని వ్యాపారులు చెపుతున్నారు.



ఆరబోసిన మిరపకాయలు

గిట్టుబాటు కాని ధరలు..

ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న ధరలు మిర్చి రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కావు. ఎకరానికి సగటున రూ.1.50 లక్షల పెట్టుబడి అవుతున్నది. సాగునీటి వసతి ఉన్న భూముల కౌలు రూ.30 వేల నుంచి రూ.40 వేలు. ముఖ్యంగా తేజ రకం కాయ కోయటానికి క్వింటాకు రూ.5 వేలకు తగ్గకుండా కూలి అవుతోంది. పంట దిగుబడిపై ముఖ్యంగా వాతావరణం, తెగుళ్ల ప్రభావం చూపుతున్నాయి. మిర్చి రైతులను బొబ్బర తెగులు, అకాల వర్షాలు నట్టేట ముంచుతున్నాయి. ప్రతికూల పరిస్థితులను తట్టుకుని ఎకరానికి 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చినప్పటికీ మార్కెట్లో గిట్టుబాటు ధర లేనందున నష్టపోవటం తప్ప రైతులకు మిగిలేది ఏమీ లేదు.

తోటలు ఆశాజనకం

జిల్లాలో 30 వేల ఎకరాల్లో మిర్చి తోటలు సాగవుతున్నాయి. ముఖ్యంగా పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో మిర్చి సాగు ఎక్కువ. ఇక్కడ తోటలు ఆశాజనకంగా ఉన్నాయి. లేత తోటలు ఒక మాదిరిగా ఉన్నాయి. అయితే ఒకవైపు మునేటి కాల్వ నీళ్లు, మరోవైపు సాగర్ జలాలు వస్తుండటంతో తోటలకు ప్రస్తుతం సాగునీటి



కొరత లేదు. ఇప్పటి వరకు ఏలాంటి చీడపీడలు ఆశించనందున మంచి దిగుబడులు వస్తాయని రైతులు ఆశపడుతున్నారు.

తగ్గిన ధర.. లక్షల్లో నష్టం..

- కొమ్మినేని సత్యనారాయణ, రైతు



ప్రస్తుత ధర మిర్చి రైతుకు ఏమాత్రం గిట్టుబాటు కాదు. శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసిన ఒక్కొక్క రైతుకు, ధర దారుణంగా పడిపోవటంతో లక్షల్లో నష్టం వస్తున్నది. దీనికితోడు మార్కెట్‌పై కూడా రైతులకు సరైన అవగాహన లేక మార్కెట్లో ధర ఎందుకు పెరుగుతుందో, ఎందుకు తగ్గుతుందో ఏమాత్రం తెలియటం లేదు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని మిర్చి మార్కెట్, పంట దిగుబడులు, అవసరాలు, ఎగుమతులు గురించి ఎప్పటికప్పుడు పాలకులు, ఉన్నతాధికారులు అవగాహన కల్పించాల్సిఉంది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105,113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 620

హిందూ ధర్మ పరిరక్షణే సమరసత లక్ష్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : హిందూ ధర్మ పరిరక్షణే లక్ష్యంగా స్వర్గీయ పీవీఆర్‌కె ప్రసాద్ ఆలోచనతోనే సమరసత సేవా ఫౌండేషన్ ఏర్పడిందని ఖండ కార్యవాహ ఎదురువాడ శ్రీనివాసరావు అన్నారు. కానుమోలు రామాలయంలో మంగళవారం నిర్వహించిన సమరసత సేవా ఫౌండేషన్ (ఆవిర్భావ దినోత్సవ)వసంతోత్సవంలో ఆయన పాల్గొన్నారు. జనవరి 5న నిర్వహించే హైందవ శంఖారావాన్ని జయప్రదం చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మప్రచారక్ యడవల్లి పాండురంగారావు, మండల కన్వీనర్ తట్టి సుబ్బారావు, సహ కన్వీనర్ దావులూరి శ్రీహరి, సభ్యులు శ్రీపతి నరసింహారావు, బలరాం, తదితరులతో పాటు భక్తి బృంద సభ్యులు పాల్గొన్నారు.

28 వాహనాలకు జరిమాన

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మోటారు వాహన చట్టాన్ని అతిక్రమించి వాహనాలు నడిపితే చట్టారీత్యా చర్యలు తప్పవని ఎస్సై సురేష్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఎస్సై వాహన తనిఖీలు నిర్వహించారు. సోమవారం రాత్రి కూడా తనిఖీలు నిర్వహించారు. సరైన ఆధారపత్రాలు, హెల్మెట్, లైసెన్సు లేని 28 మందికి జరిమాన విధించినట్లు ఎస్సై తెలిపారు.

బీమాతో రైతుకు మేలు

ఉయ్యూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రబీ పంటల కాలం (2024 - 2025)కు సంబంధించి మినుము, వరి, మొక్కజోన్న, పెసర పంటలను ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ గన్నవరం ఏడీ యు.సునీల్ తెలిపారు. బ్యాంకు ద్వారా పైపంటలకు రుణం తీసుకున్న రైతులకు సంబంధిత బ్యాంకు ప్రీమియం వసూలు చేసి బీమా కంపెనీకి నేరుగా చెల్లిస్తారని తెలిపారు.

అభయాంజనేయస్వామికి ఘనంగా అభిషేకాలు

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఈవో కె.శ్రీనివాస్ పర్యవేక్షణలో అర్చకులు మారపల్లి సీతారామానుజాచార్యులు, శ్రీనివాసాచార్యులు, రామాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విజయవాడకు చెందిన ప్రముఖ వైద్యులు మల్ల హేమంత్‌కుమార్, డాక్టర్ నాగరత్నం దంపతులు 400 మందికి అన్నప్రసాద వితరణ చేశారు.

రావికి ఘన సత్కారం

గుడివాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావును ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఆయనతో పాటుగా స్థానిక ఎన్‌టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్‌ను కూడా సత్కరించారు.

పొంచిఉన్న ప్రమాదం!

- భారీ వర్షాలతో పేటచెరువుకు గండ్లు
- కొట్టుకుపోయిన రెండు కల్వర్టులు
- పంటను తరలించేందుకు ప్రధాన మార్గంగా చెరువు గట్టు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- పంచాయతీకి అప్పజెప్పాలంటున్న గ్రామస్తులు

(ఉంగుటూరు - ఆంధ్రజ్యోతి)

మండలంలోని ఆత్కూరు పేటచెరువు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. మూడు నెలల క్రితం సంభవించిన వరదలకు చెరువుకు ఎగువ ప్రాంతాలనుంచి భారీగా వరదనీరు చేరడంతో పడమరవైపు గట్టు బలహీనపడి కోతకు గురైంది. దీంతో రెండుచోట్ల భారీ గండ్లు పడ్డాయి. గట్టుకు నిర్మించిన రెండు కల్వర్టులు కొట్టుకుపోవడంతోపాటు వాటికి అమర్చిన తూములు కూడా ధ్వంసమయ్యాయి. ఫలితంగా పంట ఉత్పత్తులను తరలించేందుకు ప్రధాన మార్గంగా వున్న ఈ గట్టుపై రాకపోకలు స్తంభించాయి. 53 ఎకరాల్లో విస్తరించిన ఈ పేటచెరువు నీటి ఆధారంగా రైతులు సుమారు 300ఎకరాల్లో వరి, పామాయిల్ పంటలను సాగుచేస్తున్నారు. సుమారు నాలుగు మీటర్ల వెడల్పు, కిలోమీటరు మేర పొడవుగల ఈ చెరువుగట్టుపై రైతులు నిత్యం రాకపోకలు సాగిస్తూ తాము పండించిన పంట ఉత్పత్తులను వివిధ వాహనాలద్వారా తరలిస్తుంటారు. ఈనేపథ్యంలో గట్టు భారీగా కోతకు గురై ఒక్క అడుగు గట్టు మాత్రమే మిగలడంతో అది



బురదమయమైన డొంకరోడ్డు



పేటచెరువుగట్టుకు పడిన గండ్లు

ఎప్పుడు తెగిపడుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలావుండగా ఈ గట్టుకు అనుసంధానంగా సుమారు అరకిలోమీటర్‌మేర వున్న డొంక రోడ్డు కూడా బురదమయం కావడంతో పంట ఉత్పత్తులను ఎలా తరలించాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ సారి భారీవర్షం పడితే గండ్లు పూర్తిగా తెగి పంటలకు భారీ నష్టం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువుకు పడిన గండ్లు పూడ్చాలని పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగి వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెరువుకు పడిన గండ్లు పూడ్చి గట్టును పటిష్టపరచాలని, డొంక రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు. అలాగే మీడియం ఇరిగేషన్ శాఖ కింద వున్న ఈ చెరువును గ్రామ పంచాయతీకి అప్పగించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బండారుగూడెంకు చెందిన మెరుగు జోజి(38)కి కరెంట్‌షాక్ తగలడంతో రోడ్డుపై పడి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. వీరవల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జోజి పంచాయతీలో ఔట్ సోర్సింగ్ సిబ్బందిగా పనిచేస్తూ ఎలక్ట్రీషియన్‌గా గ్రామంలో పనులు చేస్తుంటాడు. గ్రామంలోని ఒక ఇంటిలో వైరు తెగిపోవడంతో కలిపేందుకు సోమవారం మధ్యాహ్నం స్తంభం ఎక్కిన జోజికి షాక్ తగలడంతో కింద పడిపోయాడు. తలకు బలమైన గాయమవడంతో చిన్నఅవుటపల్లిలోని సిద్దార్థ వైద్య శాలకు తరలించి వైద్యచికిత్స అందిస్తుండగా మంగళవారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్ప చెప్పారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వీరవల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.



సందేశమిస్తున్న విజయవాడ మేత్రాసన పీఠాధిపతులు తెలగతోటి జోసఫ్ రాజారావు

పునీత ఫ్రాన్సిస్ శౌరి జీవితం ఆదర్శం

ముగింపు ఉత్సవాల్లో విజయవాడ మేత్రాసన పీఠాధిపతులు తెలగతోటి జోసఫ్ రాజారావు

గన్నవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పునీత ఫ్రాన్సిస్ శౌరి జీవితం అందరికి ఆదర్శమని విజయవాడ మేత్రాసన పీఠాధిపతులు తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. మండలంలోని అజ్జంపూడి విచారణలో గత మూడు రోజులుగా జరుగుతున్న పునీత ఫ్రాన్సిస్ శౌరి మహోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. తొలుత సమిష్టి దివ్య బలిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా జోసఫ్ రాజారావు ప్రసంగిస్తూ క్రీస్తుమార్గాన్ని అనుసరించి అన్ని ప్రాంతాల్లో క్రీస్తు బోధన చేసిన ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించారన్నారు. ప్రపంచ మానవాళికి క్రీస్తు బోధనలు అనుసరణీయమని చెప్పారు. నిన్నువలే నీ పొరుగు వారిని ప్రేమించాలనే మాటలను తూచా తప్పకుండా శౌరి పాటించారని తెలిపారు. గోవా నుంచి తన సువార్తను ప్రారంభించి అన్ని ప్రాంతాలకు విస్తరించి క్రీస్తు విశిష్టతను సాటి చెప్పారన్నారు. ఏసుక్రీస్తు మార్గాన్ని అనుసరించి పాపుల రక్షణకు క్రీస్తు బోధనలను చాటి చెప్పారన్నారు. గత ఎనిమిదేళ్లుగా ఈ మహోత్సవాలకు వస్తున్నానని కన్నుల పండుగగా జరగటం గొప్ప విషయమన్నారు. పునీత ఫ్రాన్సిస్ జేవీఆర్ గాయక బృందం గీతాలాలపించారు. వెల్లటూరు నిత్య సహాయ మాత బృందం కోలాటం చేశారు. సాయంత్రం పునీత శౌరి వారి స్వరూపంతో ఊరేగింపు నిర్వహించారు. రాత్రి ధనవంతుడు-బీదలాజరు క్రైస్తవ నాటకాన్ని ప్రదర్శించారు. పలువురు గురువులు పాల్గొన్నారు.

జంక్షన్‌లో చోరీ యత్నం

- రాజుల కాలనీలో సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి అపార్టుమెంట్‌ల్లోకి చొరబడిన దుండగులు

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక రాజుల కాలనీలోని మూడు అపార్టుమెంట్‌లో గుర్తుతెలియని దుండగులు చోరీ యత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. రాజుల కాలనీలో వరుసగా ఉన్న మూడు అపార్టుమెంట్‌ల్లోకి చొరబడి చోరీ యత్నం చేశారు. కాలనీలో నూతనంగా నిర్మించిన సర్కిల్ పోలీస్ కార్యాలయం పక్క రోడ్డులో మొదటి అపార్టుమెంట్ వెనుక నుంచి ప్రహరీ దూకడానికి ప్రయత్నించగా సీసీ కెమెరాలు ఉన్నట్లు గమనించి వెనుదిరిగారు. పక్కనే ఉన్న మరో రెండు అపార్టుమెంట్‌ల్లో సీసీ కెమెరాల వైర్లు కట్‌చేసి అపార్టుమెంట్‌లోకి ప్రవేశించారు. ఉదయం నైట్ వాచ్‌మెన్ వైర్లు కట్ చేసి ఉండటాన్ని గమనించి అపార్టుమెంట్ వాసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ ఫుటేజ్‌లు పరిశీలించారు. మంకీ క్యాప్‌లు ధరించిన నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు ఒకరి సాయంతో మరొకరు అపార్టుమెంట్ కాంపౌండ్ వాల్ ఎక్కి లోపలికి దూకినట్లు తెలిసింది. జంక్షన్ ఎస్సై సురేష్‌కు సమాచారం అందించారు. సీసీ ఫుటేజ్‌లు పరిశీలించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



మంగళగిరి టీడీపీ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కేంద్ర కార్యాలయం మంగళగిరిలో ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొని అర్జీలను స్వీకరించారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి కొందరి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. పెనమలూరు మండలం చోడవరం రెవెన్యూ పరిధిలో తన పుట్టింటి వారు తనకు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన భూమిని అధికారులు నిషేధిత జాబితాలో చేర్చారని దాని నుంచి తొలగించాలని ఆవుల వేణు కుమారి, ఫిర్యాదు చేశారు. రెవెన్యూ రికార్డులను పరిగణనలోకి తీసుకోకుండా వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చి తన భూమిని మరొకరికి తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి న్యాయం చేయాలని కేసరపల్లికి చెందిన మూల్పూరు వెంకట లక్ష్మీప్రసాద్ విజ్ఞప్తి చేశారు. వచ్చిన ప్రతి అర్జీ పరిష్కారానికి కృషి చేస్తామని యార్లగడ్డ తెలిపారు.

భూ సమస్యలకు త్వరలో పరిష్కారం

మల్లవల్లి పారిశ్రామిక వాడ భూములను పరిశీలించిన ఆర్డీవో బాల సుబ్రహ్మణ్యం



భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, తహసీల్దార్ నాగభూషణం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మల్లవల్లి పారిశ్రామికవాడ అభివృద్ధికి అవసరమైన భూములను గుర్తించడంతో పాటు రైతులకు సంబంధించిన భూసమస్యలను త్వరలోనే పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని గుడివాడ ఆర్డీవో జి. బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. మల్లవల్లిలో పారిశ్రామికవాడకు సంబంధించిన భూములను తహసీల్దార్ నాగభూషణం, జోనల్ మేనేజర్ బాబ్జీలతో కలిసి మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పారిశ్రామికాభివృద్ధికి అడ్డంకులు లేకుండా అవసరమైన భూముల వివరాలను మ్యాప్ సహాయంతో పరిశీలించారు. పారిశ్రామికవేత్తలకు కేటాయించేందుకు అందుబాటులో ఉన్న భూముల వివరాలు, మల్లవల్లి గ్రామావసరాలకు కేటాయించాల్సిన భూముల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పారిశ్రామికవాడ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో అడ్డంకిగా మారిన భూవివాదాలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకునేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి భూవివాదాలను పరిష్కరించేందుకు ముందస్తుచర్య గా భూపరిశీలన చేసామన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ నాగభూషణం, జోనల్ మేనేజర్ బాబ్జీ, మండల సర్వేయర్ ఫణికుమార్ పాల్గొన్నారు.





గన్నవరంలో జరిగిన దివ్యాంగుల దినోత్సవంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్.. ఉయ్యూరులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న సుధారాణి, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు

దివ్యాంగులకు చేయూతనివ్వాలి

గన్నవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు చేయూత నివ్వాలని వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్ అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ రాములు నాయక్, ఎంపీడీవో టి.స్వర్ణలత, జడ్పీటీసీ సభ్యురాలు ఏఈ రాణి, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, పద్మావతి, సుభాషిణి పాల్గొన్నారు.

ఉయ్యూరు భవిత సెంటర్‌లో..

ఉయ్యూరు : స్థానిక భవిత సెంటర్‌లో మంగళవారం దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ బాల బాలికలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బి.సుధారాణి, ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రతినిధి సూర్య కుమారి పాల్గొన్నారు. ఇన్నర్‌వీల్‌క్లబ్ మాజీ సెక్రటరీ విష్ణుప్రియ ఆధ్వర్యంలో భోజనం, పండ్లు, ఫలహారాలు సమకూర్చారు. జడ్పీస్కూల్ హెచ్‌ఎం కె. జోత్స్నాదేవి, భవిత సెంటర్ ఉపాధ్యాయురాలు గీత, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యురాలు ఉప్పాల పద్మ పాల్గొన్నారు.

మానవత కార్యాలయంలో..

హనుమాన్‌జంక్షన్ : మానవత హనుమాన్ జంక్షన్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ముందుగా తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ జయంతిని నిర్వహించారు ఈ సందర్భంగా సభ్యులు వేగిరెడ్డి సూర్యనారాయణ ఆదిత్య, ఆశాజ్యోతి పాఠశాలల నిర్వాహకులు ఆకుల వెంకట రమణ, మరీదు వెంకటస్వామిలకు రూ.2500లు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు జయ రామచంద్రరావు, గణేష్, ఇందిరాదేవి, జేవీవీ సత్యనారాయణ, కొట్నాని రామ చంద్రరావు, సుబ్బాచారి పాల్గొన్నారు. ● ఆదిత్య బధిర దివ్యాంగుల పాఠశాలలో ప్రిన్సి పాల్ ఆకుల వెంకట రమణ ఆధ్వర్యంలో దివ్యాం గుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ ఇమంది అన్నపూర్ణ పాల్గొన్నారు.



తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మానవత సభ్యులు

వీరవల్లి భవిత కేంద్రంలో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : దివ్యాంగుల్లో ఆత్మ విశ్వాసం పెంపొందించేలా చేయూత నందిస్తే అందరితో సమానంగా పోటీ పడగలరని తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి గుండపనేని ఉమా వరప్రసాద్ అన్నారు. వీరవల్లి భవిత కేంద్రంలో మంగళవారం దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అమృతపల్లి సూర్యనారాయణ, మండాది రవీంద్ర, స్పెషల్ ఎడ్యుకేటర్ సుశీల, నాగమణి, హెచ్‌ఎం మోహన కృష్ణ, భగీరధి, ఉషారాణి, జగతి పాల్గొన్నారు.

నాగవరప్పాడు భవితా కేంద్రంలో

ఉంగుటూరు : మండలంలోని నాగవరప్పాడు భవితా కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్, బాస్కెట్‌బాల్, వంటి ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు పెద్దల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం, చేరగుడి అనిత, స్థానిక పాఠశాల హెచ్‌ఎం యు.మధుసూదనరావు, ఐఈఆర్‌పీ భాగ్యలక్ష్మి, సీఆర్పీ కవిత, ఫిజియోథెరపిస్ట్ ఎస్.నాగమల్లేశ్వర రావు పాల్గొన్నారు.

ఏడో రోజుకు చేరిన కార్మికుల నిరసన

గన్నవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గన్నవరం అయోధ్య అపార్టుమెంట్స్ నిర్మాణంలో పని చేసిన కార్మికులను బిల్డర్ గుర్రం నాని మోసం చేశారని బాధితులు రామ్మోహ నరావు, సతీష్ అన్నారు. తమకు రావాల్సిన బకాయిలను ఇవ్వాలని కోరుతూ చేపట్టిన రిలే దీక్షలు మంగళవారానికి ఏడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2018 నుంచి 2022 వరకూ అపార్టుమెంట్స్ నిర్మాణంలో తాపీ పనులు చేశామని చెప్పారు. ఆ తరువాత నుంచి తమకు రావాల్సిన రూ.4కోట్లు బకాయిలు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ వచ్చి చివరకు ఇచ్చేది లేదని చెప్పారన్నారు. దీంతో ఏం చేయాలో తెలియ లేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని కార్మికులంటే లెక్క లేకుండా బెదిరింపులకు దిగారన్నారు. ఇప్పటికైన కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేసి ఆదుకోవాలని కోరారు. బాబు, హసీనా నాగూర్ భాషా, దాస్, లక్ష్మీ ప్రసన్న, కళ్యాణ్, వెంకన్న, తేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు ఎన్.టి.ఆర్ జిల్లా, విజయవాడ రూరల్ మండలం, ఫిర్యాది నైనవరం గ్రామం, డోర్ నెం.1-120 కాపురస్తుడు చప్పిడి (లేటు) అంజనేయులు గారి కుమారుడు చప్పిడి నరేష్ కుమార్ గారు సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది, గుంటూరు జిల్లా, పెదకొండముగుండ్ల, డోర్ నెం. 1-18/ఏ కాపురస్తుడు చింతా నాగేశ్వరరావు గారి కుమారుడు చింతా మణికుమార్ గారు వారి స్వార్జితపు సొమ్ముతో ది. 26-09-2023 వ తేదీన డాక్టర్ కాకొల్లు భవానీ గారి వలన స్థిరాస్తిని క్రయం పొంది శ్రీ నున్న సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో, నెం.5830/2023రుగా రిజిష్టరు కాబడిన విక్రయ దస్తావేజు రీత్యా వారికి సంక్రమించబడిన అంబాపురం గ్రామ ఆర్.యస్.నెం.28/2, ప్లాట్ నెం. 16,17 ర్లు దాఖలా చ.గ. 400.0 లు స్థలమును వారు స్వాధీనపరచుకుని జాయింటుగా నిర్వివాదముగా అనుభవించుచూ యుండియున్నంతలో వారికి సంక్రమించబడిన ఆస్తిని వారు విక్రయింపజూపగా నా క్లయింట్ అయిన ఎన్.టి.ఆర్ జిల్లా, విజయవాడ రూరల్ మండలం, ఫిర్యాది నైనవరం గ్రామం, డోర్ నెం.1-120 కాపురస్తుడు చప్పిడి (లేటు) అంజనేయులు గారి కుమారుడు చప్పిడి నరేష్ కుమార్ గారు సదరు షెడ్యూలు దాఖలా ఆస్తిని కొనదలచి కొంత ప్రతిఫలమును చెల్లించి విక్రయ ఖరారు పొంది మరికొద్ది రోజులలో రిజిష్టరు చేయించుకోబోవుచున్నారు. కావున సదరు షెడ్యూలు దాఖలా ఆస్తిపై చెల్లదగు ఎట్టి అభ్యంతరములు గానీ, ఆక్షేపణలు గానీ, కోర్టు జప్తులు గానీ, బ్యాంకు సెక్యూరిటీలు గానీ, తనఖా వగైరా ఎట్టి అభ్యంతరములు వున్న యెడల ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి 10 రోజులలోగా నాకు గానీ, నా క్లయింటుకు గానీ వ్రాతపూర్వకముగా సంబంధిత ఆధారములతో తెలియపరచగలరు. సదరు గడువు అనంతరం వచ్చు ఆక్షేపణలు, అభ్యంతరములు నా క్లయింటును బద్ధుడిని చేయజాలవు. అట్టి ఆక్షేపణలు పరిగణలోకి తీసుకొనబడవు.

షెడ్యూలు :- ఎన్.టి.ఆర్ జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి పరిధిలో చేరిన, నున్న సబ్ రిజిస్ట్రారు వారి యిలాక, విజయవాడ రూరల్ మండలం, అంబాపురం గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన, అంబాపురం గ్రామ ఆర్.యస్.నెం.28/2 రు దాఖలా చ.గ.400-0 లు ఖాళీ స్థలమునకు హద్దులు : తూర్పు : అ.33.0 లు వెడల్పు గల రోడ్డు అ. 65-0 లు, దక్షిణం : ప్లాట్ నెం. 24బి రు దాఖలా సి.వి. సుబ్రహ్మణ్యేశ్వరరావు గారి ఆస్తి అ.53-0 లు, పడమర : ప్లాట్ నెం. 14,15 ర్లు దాఖలా ఆస్తి అ. 71-0 లు, ఉత్తరం : ప్లాట్ నెం.18 రు దాఖలా ఆస్తి, అ.53-0 లు., ఈ నాలుగు హద్దుల మధ్య చ.గ. 400-0 లు స్థిరాస్తి స్థలమున్నూ

యం.రాజీవ్ కుమార్, అడ్వకేట్, బి.ఎ., ఎల్.ఎల్.బి.
ప్లాట్ నెం. 14, సెక్టార్-3, రోడ్డు నెం.2, లోటస్ ల్యాండ్ మార్క్, అయోధ్యనగర్, విజయవాడ-520003. సెల్. **8247566055**



రెండో ఫ్లై ఓవర్ నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

సెంట్రల్‌కు మరో ఫ్లై ఓవర్..!

● సీఎం చంద్రబాబు నాయుడికి బొండా ఉమా వినతి

అజిత్‌సింగ్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకుని అజిత్‌సింగ్‌నగర్‌లోని ప్రస్తుత ఫ్లై ఓవర్ పక్కన మరో ఫ్లై ఓవర్ నిర్మించాలని కోరుతూ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి వినతిపత్రం అందజేశారు. అమరావతిలోని సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రిని కలిసిన ఉమా నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యలను వివరించారు. 1995 జనాభా, ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని అప్పటిలో ఫ్లై ఓవర్ నిర్మాణం జరిగిందని ప్రస్తుతం జనాభా, వాహనాల రద్దీ విపరీతంగా పెరిగి రోజూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని వివరించారు. ఈ ఫ్లై ఓవర్ మీదుగా నిత్యం లక్షమందికి పైగా రాకాపోకలు సాగిస్తున్నారని అందుకే ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుందని, సమస్యలను దృష్టిలో పెట్టుకుని రెండో ఫ్లై ఓవర్ నిర్మించాల్సిన అవసరం ఉందని వినతిపత్రంలో కోరారు. ఇప్పటికే ఎంపీ కేశినేని చిన్నితో కలిసి 2వ ఫ్లై ఓవర్ విషయమై కేంద్ర రైల్వే మంత్రితో రెండుసార్లు మాట్లాడగా మంత్రి సానుకూలంగా స్పందించినట్టు సీఎం దృష్టికి బొండా ఉమా తీసుకెళ్లారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే ఈ రెండవ ఫ్లై ఓవర్ నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఉమా ముఖ్యమంత్రిని కోరారు.

క్రీడాపాలసీతో క్రీడాకారులకు సత్వర న్యాయం

● శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు

● స్టేట్ సీనియర్ ఆర్చరీ టోర్నీ ప్రారంభం

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడ లేని విధంగా హర్యానా రాష్ట్రాన్ని మించి క్రీడాకారులకు ఆంధ్రప్రదేశ్‌లో మేలైన క్రీడా పాలసీని తీసుకువచ్చామని, అన్ని విధాలుగా పేద క్రీడాకారులను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కంకణబద్ధులై పనిచేస్తున్నామని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు స్పష్టం చేశారు. నగరంలోని శాతవాహన కళాశాల గ్రౌండ్స్‌లో ఈ నెల 3 నుంచి 5 వరకు జరగనున్న ఆంధ్రప్రదేశ్ 31వ సీనియర్ ఇండియన్ రౌండ్, 44వ సీనియర్ రికర్వ్, 20వ సీనియర్ కాంపౌండ్ రాష్ట్రస్థాయి (అంతర్ జిల్లాల) ఆర్చరీ టోర్నీని ఆయన రికర్వ్ విభాగంలో బాణం సంధించి పోటీలను మంగళవారం ప్రారంభించారు. తొలుత దివంగత ఇండియా ఆర్చరీ కోచ్ లెనిన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి చెరుకూరి కృష్ణకుమారి అధ్యక్షతన జరిగిన సభలో రవినాయుడు మాట్లాడుతూ గతంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఆర్చరీ అకాడమీని చెరుకూరి సత్యనారాయణ పర్యవేక్షణలో ఏర్పాటు చేసేలా తన వంతు కృషి చేస్తామన్నారు. కోచ్ పోస్టుల భర్తీలో 50 శాతం సీనియర్ క్రీడాకారులకు రిజర్వేషన్‌తో భర్తీ చేస్తామని, సగంలో ఆగిన క్రీడా వికాస కేంద్రాలను త్వరలో పూర్తి చేస్తామన్నారు. రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ సెక్రటరీ సత్యనారాయణ మాట్లాడుతూ చంద్రబాబుకిచ్చిన హామీలో భాగంగా పారిస్ ఒలింపిక్స్‌కు ఆర్చరీ నుంచి ఏపీ నుంచి క్రీడాకారుడ్ని పంపామని, రానున్న రోజుల్లో అత్యుత్తమ ప్రమాణాలతో క్రీడాకారులను తయారు చేస్తానని హామీ ఇచ్చారు. బాయ్ మాజీ ఉపాధ్యక్షుడు పున్నయ్య చౌదరి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్, జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్ (బుజ్జి), కోశాధికారి శ్రావణ్‌కుమార్, వెంకటరమణ, జి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



బాణం సంధించి పోటీను ప్రారంభిస్తున్న రవినాయుడు

స్వయం ఉపాధి పథకాలను
సద్వినియోగం చేసుకోవాలి

● అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, చిత్రంలో శాఖ కార్యదర్శి సూర్యకుమారి

మొగల్రాజపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చెప్పారు. మంగళవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ఆత్మవిశ్వాశాన్ని నింపుకుని ముందడుడు వేస్తున్న విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహిస్తే ఏదైనా సాధిస్తారంటూ సీఎం చంద్రబాబు పంపిన సందేశాన్ని వినిపించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు నెలకు రూ.6వేల పించన్ అందిస్తోందన్నారు. ప్రజా ప్రతినిధులుగా విభిన్న ప్రతిభావంతులు ఎదిగేలా కోటాకోసం పోరాడే లక్ష్మీనారాయణ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యదర్శి ఏ సూర్యకుమారి మాట్లాడుతూ సంక్షేమ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలోకి వచ్చిన వారు తమతో పాటు మరికొందరికి ఉపాధి చూపించాలని కోరారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు సంక్షేమ పథకాలు, ప్రభుత్వం అందించే ఉపాధి పథకాలను సమర్థంగా జిల్లాలో అమలు చేస్తున్నామన్నారు. వయో వృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎంఏ కుమార్ రాజా మాట్లాడుతూ తెలిగ్గా పొందే ఉపకరణాల గురించి, బ్రెయిలీ లిపి పాఠ్య పుస్తకాల గురించి తెలిపారు. తొలుత విభిన్న ప్రతిభావంతులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. క్రీడాపోటీల్లో గెలుపొందిన 61 మందికి మొదటి బహుమతులు, మరో 61 మందికి ద్వితీయ, 45 మందికి తృతీయ బహుమతులు అందించారు. ఎన్టీఆర్ జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వి. కామరాజు పాల్గొన్నారు.

విధి వంచితులకు
సుధీక్షణ్ అభయం

● ప్రమాదాల్లో అవయవాలు కోల్పోయిన క్షతగాత్రులు

● ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృత్రిమ అవయవాల పంపిణీ

ఆంధ్రజ్యోతి, విజయవాడ: జీవనోపాధి కోసం వివిధ రంగాల్లోని వారి తలరాతలను విధి మార్చింది. అప్పటి వరకు ఏదో ఒక ఉపాధి చేసుకుంటున్న వారిని వికలాంగులను చేసి ఇళ్లకు పరిమితం చేసింది. హెల్మెట్ ధరించిన వారు కొందరు.. బైక్‌లపై వెనుక కూర్చున్నవారు మరికొందరు.. ఇలా ప్రమాదాల బారిన పడి ప్రాణపాయం నుంచి తప్పించుకుని వికలాంగులయ్యారు. ఇలాంటి వారికి విజయవాడకు చెందిన సుధీక్షణ్ ఫౌండేషన్ కృత్రిమ అవయవాలను ఉచితంగా అందజేస్తోంది. ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా బాలోత్సవం భవన్‌లో వివిధ ప్రమాదాల్లో కాళ్లు, చేతులు కోల్పోయిన వారికి ప్రతి ఏడాది ఈ కృత్రిమ అవయవాలను అందజేస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన వికలాంగులను ఆంధ్రజ్యోతి పలకరించింది. వారు చెప్పిన వివరాలివే.

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడేనికి చెందిన జి.రాజ్‌కుమార్ ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. ఈ ఏడాది మే 19న బిర్యానీ తినాలనిపి వరుసకు అన్నయ్య అయిన సాయికుమార్‌కు చెప్పాడు. వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా జాతీయ రహదారిపైనున్న దాబాకు బయలుదేరారు. జాతీయ రహదారిపై మలుపు తీసుకోవాల్సి వచ్చి ముందుగా వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేశారు. లారీ వెనుక భాగం తగలి ఈడ్చుకుపోయింది. సాయికుమార్ దుర్మరణం చెందాడు. వెనుక కూర్చున్న రాజ్‌కుమార్‌కు తెలివి వచ్చేసరికి ఒక కాలు తొలగించి ఉంది. అలాగే తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం గ్రామానికి ఎస్‌కే షాబుద్దీన్ కుటుంబంతో కలిసి కృష్ణా జిల్లాకు వచ్చాడు. ముందుగాకుటుంబంతో కలిసి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులు కారులో ఉయ్యూరు బయలుదేరారు. షాబుద్దీన్ ఆయన బావ రాహుల్ మాత్రం బైక్‌పై వస్తుండగా కరకట్టపై కారు ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న రాహుల్ హెల్మెట్ ధరించి ఉండటంతో స్వల్ప గాయాలతో బయటపడగా, వెనుక కూర్చున్న షాబుద్దీన్ మాత్రం కాలు కోల్పోయాడు. అలాగే కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన జి.రాంబాబు ఆటోడ్రైవర్. గత ఏడాది శివారున ఉన్న జగనన్న కాలనీకి బయలుదేరాడు. తలపై హెల్మెట్ పెట్టుకుని స్కూటర్‌పై బయలుదేరాడు. కొంతదూరం వెళ్లాక స్కూటర్ అదుపు తప్పి పడిపోయాడు. హెల్మెట్ ఉండడంతో తలకు గాయం కాలేదు. కుడికాలు పాదానికి స్వల్ప గాయాలయ్యాయి. పాదం బాగా వాచింది. చిన్న గాయాలే కదా ఇంటివద్దే చికిత్స చేసుకున్నాడు. తర్వాత కాలు వాపు పెరగడంతోపాటు లోపల ఇన్‌ఫెక్షన్ సోకింది. క్రమంగా కాలు తొలగింపునకు కారణమైంది. ఇలా రోజుకు ఎంతోమంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు, వికలాంగులుగా మారుతున్నారు.

రైల్వే స్టేడియాల్లో పారా క్రీడలకు సౌకర్యాలు

● డీఆర్ఎం పాటిల్



అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో పాల్గొన్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్, అధికారులు

రైల్వే స్టేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డివిజన్లలోని అన్ని రైల్వే స్టేషన్లలో పారా క్రీడలకు అనువైన సౌకర్యాలు కల్పిస్తామని విజయవాడ డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా విజయవాడలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజయవాడ రైల్వే డివిజన్ దివ్యాంగుల సంక్షేమ సంఘం, విజయవాడ రైల్వే పరిపాలనా విభాగం సహకారంతో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏడీఆర్ఎం కే శ్రీనివాసరావు, రైల్వే ఆసుపత్రి చీఫ్ మెడికల్ సూపరింటిండెంట్ శౌరిబాల, మజ్దూరు యూనియన్ నేతలు లక్ష్మి, ఎంప్లాయిస్ సంఘ నేత ఆమంచి శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నేత పాపారావు, పాల్గొన్న ఈ కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ దివ్యాంగుల సంక్షేమ సంఘం చైర్మన్ రామకృష్ణ అధ్యక్షత వహిస్తూ దివ్యాంగ ఉద్యోగులకు ప్రతి అధికారి కూడా ఎంతో సహకరిస్తున్నారని కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నరేంద్ర ఏ పాటిల్ మాట్లాడుతూ 2015లో ప్రధాని నరేంద్ర మోదీ సుగమ్య భారత్‌ను ప్రారంభించి వికలాంగుల పేరును తీసేసి దివ్యాంగులుగా మార్చారని గుర్తు చేశారు. 90 విమానాశ్రయాలు, 700 రైల్వే స్టేషన్లలో దివ్యాంగులకు సౌకర్యాలు కల్పించారన్నారు. దివ్యాంగులు సౌకర్యాలు పొందేందుకు 1.10 కోట్లకు పైగా ప్రత్యేక గుర్తింపు కార్డులను జారీ చేశారన్నారు. ఈ సందర్భంగా పారా క్రీడాకారుడు సుబ్బయ్య తిరుమలయ్య కుమార్‌ను దుశ్శాలువా కప్పి జ్ఞాపిక ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా తిరుమలయ్య కుమార్ ఒలింపిక్ క్రీడలతో పాటు పారా క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. డీఆర్ఎం స్పందిస్తూ అన్ని డివిజన్లలోని రైల్వే స్టేషన్లలో పారా క్రీడలకు అనువైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. దివ్యాంగులకు మోటర్ ట్రై సైకిళ్ల కొనుగోలుకు ఎస్‌బీఎఫ్ ఫండ్ ద్వారా రూ.25వేలు, రైల్వే మహిళా సంక్షేమ సంఘం ద్వారా రూ.10 వేలు ఇస్తామని, అవసరమైతే బ్యాంకు రుణాలు ఇప్పిస్తామన్నారు. శౌరిబాల, ఏడీఆర్ఎంలు తమ సందేశాలను ఇచ్చారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యదర్శి శివకుమార్, కోశాధికారి జగదీశ్వరరావు, డివిజన్ అసిస్టెంట్ ఎక్రటరీ ఎర్రంనాయుడు, రవి, రాంబాబు, వి.ఎల్.ఎస్.మూర్తి, చిలుకా కిషోర్, ఆదినారాయణ, వెంకట రావు, మురళి, త్రివిక్రమరావు పాల్గొన్నారు.

నా గెలుపునకు సహకరించండి..!

● సీపీఐ నేతల్ని కోరిన ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్



సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణను కలిసి మద్దతు కోరుతున్న పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు, చిత్రంలో వనజ

గవర్నర్‌పేట, డిసెడిసెడింబరు 3 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల శాసనమండలి గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుంచి వివిధ ప్రజా సంఘాలు బలపర్చిన పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావు మంగళవారం సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణను కలిసి తన గెలుపునకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు తాను గత 14ఏళ్లుగా మండలిలో, బయట ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, నిరుద్యోగులు, విద్యార్థులు, అంగన్వాడీలు, రైతులు, కార్మికులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సమస్యలపై పోరాటాలు చేస్తున్నామని, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సమస్యలు పరిష్కరిస్తున్నట్టు రామకృష్ణకు వివరించారు. ఈ ఎన్నికల్లో వివిధ సంఘాలు, రాజకీయ పార్టీల మద్దతు కోరుతున్నానని, దాదాపు 50కి పైగా సంఘాలు మద్దతు తెలిపాయని, సీపీఐ కూడా అండగా నిలవాలని కోరారు. సీపీఐ జాతీయ కమిటీ సభ్యురాలు అక్కినేని వనజ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టీటీ పోటీలకు పలువురి ఎంపిక



టీటీ ప్లేయర్స్‌తో కోచ్‌లు, అసోసియేషన్ ప్రతినిధులు

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉమ్మడి జిల్లా టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీల్లో పలువురు క్రీడాకారులు సత్తా చాటారు. ఇందిరాగాంధీ స్టేడియంలో రెండురోజులుగా జరుగుతున్న పోటీల్లో విజేతలను అసోసియేషన్ ప్రకటించింది. వీరంతా ఈ నెలలో కాకినాడలో ఈ నెల 20, 21న జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్లేయర్స్ జిల్లాలకు ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా జాయింట్ సెక్రటరీ బొడ్డు శ్రీనివాస్ తెలిపారు.

ఎన్టీఆర్ జిల్లా క్రీడాకారులు

అండర్-15 బాలబాలికల విభాగాల్లో జి.లోహిత్, వేదాన్ష్, కపిల్ భార్గవ, వైభవ్, పి.ధృతి, నజ్మా, శాన్విత, మోక్ష తన్మయి, పురుషులు, మహిళల విభాగాల్లో సత్య, ప్రత్యాకాష్, గౌస్, అబ్దుల్, వేదాన్ష్, పి ధృతి, సైరాబాను, మనస్వి, ఎం చార్వి, నజ్మా.

కృష్ణా జిల్లా క్రీడాకారులు


అండర్-15 బాలబాలికల విభాగాల్లో చేతన్, అభిరామ్, జయరామ్, కిరణ్ తేజ, చార్వి, మనస్వి, అనన్య ఆనంద్, పురుషుల, మహిళా విభాగాల్లో ఫిరోజ్, సుభాస్‌బాబు, భువన్, లోహిత్, కపిల్, తన్వి, మోక్ష, బృహతి, శాన్విత, మౌతిక.

మూఢనమ్మకాలపై గోరా కొరడా

● శాస్త్రీయ దృష్టిని పెంపొందించడమే గోరా సైన్స్ సెంటర్ ముఖ్యోద్దేశం

● గోరా సైన్స్ డైరెక్టర్ నియంత

పటమట - ఆంధ్రజ్యోతి: సైన్స్‌తో పాటు శాస్త్రీయ దృష్టిని పెంపొందించే ముఖ్య ఉద్దేశంతో 1961లో గోరా సైన్స్ సెంటర్ స్థాపించామని గోరా సైన్స్ డైరెక్టర్ నియంత తెలిపారు. సైన్స్‌ను అభివృద్ధి చేయాలనుకునే వాళ్లందరూ క్లబ్‌లో సభ్యులేనన్నారు. గోరా సంతానం 9 మంది సైన్స్ సెంటర్ కలాపాల్లో చురుగ్గా పాల్గొంటారని వివరించారు. 1920 నుంచే గోరా అశాస్త్రీయ ఆచార వ్యవహారాలు, మూఢనమ్మకాలను ఖండించటం మొదలెట్టారన్నారు. అమావాస్యంటే ఎందుకంత భయం. చంద్రకళలో అమావాస్య ఒకటని దానికి భయపడనవసరం లేదని తెలిపారు. భూమికి సూర్యుడికి మధ్యలో తిరిగే క్రమంలో చంద్రుడు అడ్డుతగటం వల్ల గ్రహణం ఏర్పడుతుందని, గ్రహణమనేది మూఢనమ్మకమని, అలాగే గర్భిణులు గ్రహణం నాడు బయట కొస్తే అంగవైకల్యం వస్తుందంటారని, ఇదీ మూఢ నమ్మకమేనన్నారు. ఈ సంప్రదాయం ప్రపంచంలో ఎక్కడా లేదని, కేవలం భారతదేశంలో హిందూ సంప్రదాయాన్ని పాటించేవాళ్లలో మాత్రమే ఉందన్నారు. గతంలో వినాయకుడు పాలు తాగుతున్నాడని వదంతులు షికారు చేశాయని, అసలు విషయమేంటంటే ఘన పదార్థాలు, ద్రవపదార్థాలను సంగ్రహిస్తాయని ఇది కొహిడిల్ ఫోర్సు అనే సూత్రం ఆధారంగా జరుగుతాయన్నారు. సైన్స్ ఎగ్జిబిషన్ ముఖ్యోద్దేశం ప్రదర్శనాత్మక విశ్లేషణ ఇవ్వడం కోసమే ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుత పరిశోధకులు శుక్ర గ్రహం వెలుపలి వరకు చూడగలుతున్నారని, అక్కడ కార్బన్ డైయాక్సైడ్ 98శాతం, వేడి 46 డిగ్రీలు ఉంటుందని, సల్ఫర్ డై ఆక్సైడ్ కూడా ఎక్కువగా ఉందని, అందుకే పరిశోధనలకు పంపిన శాటిలైట్స్ కరిగిపోతున్నాయన్నారు. అక్కడ ఇంకా పరిశోధనలు విస్తృతం చేయాలన్నారు. న్యూటన్స్ గెలీలియోలు కనుగొన్న శాస్త్రీయ విషయాల వలన అంతరిక్షణం, సైన్స్ రంగాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయన్నారు. గతంలో పూర్వీకులు ఈజిప్టు నుంచి అలెగ్జాండ్రియా వరకు కర్రనీడల పరీక్ష ద్వారా మార్పుని గమనించి భూమి గుండ్రంగా ఉందని, భూమి చుట్టు కొలతలను కనిపెట్టగలిగారన్నారు. 70 వేల ఏళ్ల క్రితమే మానవులు సహజీవనం చేశారని, 1600 నుంచి సైన్స్ అభివృద్ధి ప్రారంభమైందని, దీనికి కారణం పరిశోధననేనన్నారు.



భూమి చుట్టు కొలతను కనుగొన్న అప్పటి చాయాచిత్రం



4 లక్షల ఏళ్ల నాటి వృక్షం అవశేషాలు



గోరా సైన్స్ సెంటర్ డైరెక్టర్ నియంత



టెలిస్కోపు ద్వారా గ్రహాలను చూస్తున్న గెలీలియో



మైక్రోస్కోప్‌తో పరిశీలిస్తున్న సైంటిస్ట్ ఆంటోనీ వాన్ లీవెన్‌హోక్



మైక్రోస్కోప్‌లో పేను చిత్రం

ఈ కేసుతో నాకెలాంటి సంబంధం లేదు

● వైసీపీ నేత గౌతమ్‌రెడ్డి

సత్యనారాయణపురం, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసుస్టేషన్‌కు వైసీపీ నేత పి.గౌతమ్‌రెడ్డి మంగళవార సాయంత్రం హత్యాయత్నం కేసులో విచారణకు హాజరయ్యారు. ఏసీపీ స్రవంతిరాయ్ ఆధ్వర్యంలో పోలీసులు గౌతమ్‌రెడ్డిని విచారణ చేశారు. అనంతరం తిరిగి 7న విచారణకు రావాలని పోలీసులు గౌమ్‌రెడ్డికి తెలిపారు. ఈ సందర్భంగా గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ పోలీసులు అడిగిన 10 ప్రశ్నలకు జవాబు ఇచ్చానని, ఈ కేసుకు తనకు ఎటువంటి సంబంధం లేదన్నారు. నాపై టీడీపీ ప్రభుత్వం కేసు నమోదు చేసిందన్నారు. గత టీడీపీ హయాంలో నన్ను చంపేందుకు పోలీసు కమిషనర్ ప్రయత్నించారని ఆరోపించారు. పోలీసులు అర్ధరాత్రి సమయంలో మా ఇంట్లో అక్రమంగా దొంగల్లా చొరబడ్డారని, నన్ను చంపేందుకు తలుపులు పగలకొట్టి దొంగలకు మార్గ చూపించారన్నారు. ఆ భయంతోనే ముందస్తు బెయిల్‌కి వెళానన్నారు. కోర్టులో ఈ కేసు ఉన్నందున ఏ విషయం మాట్లాడలేనన్నారు.

వేధించారని చెబితే సస్పెండ్ చేశారు..!

● భారత్ బైబిల్ కళాశాల విద్యార్థి బ్లెస్సీ ఆవేదన

మేడ్చల్ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారత్ బైబిల్ కళాశాల రిజిస్ట్రార్ డైరెక్టర్లు మానసికంగా, శారీరకంగా వేధించారంటూ భారత్ బైబిల్ కళాశాలకు చెందిన ఓ విద్యార్థిని ఆవేదన వ్యక్తం చేసింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కళాశాల యాజమాన్యం తనను కళాశాల నుంచి తొలగించి కేసు పెట్టారని మొరపెట్టుకుంది. తనకు జరిగిన అన్యాయం పట్ల బాధిత విద్యార్థిని బ్లెస్సీ సందక (20) మంగళవారం డబిల్‌పూర్ గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. విజయవాడకు చెందిన తాను మండలంలోని డబీల్‌పూర్ గ్రామ శివార్లలో ఉన్న భారత్ బైబిల్ కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ థియాలజీ చదువుతున్నానని, కొద్దిరోజులుగా రిజిస్ట్రార్ వినయ్ కుమార్ తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని, దీనిపై కళాశాల డైరెక్టర్ జోజిరెడ్డికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపింది. ఈ ఘటన తరువాత వారిద్దరూ ఇద్దరూ కలిసి వేధిస్తుండటంతో నవంబరు 1న మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు వారిపై కేసు నమోదు చేశారని తెలిపింది. అయితే పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని వారు ఒత్తిడి తేగా ఒప్పుకోలేదని పైగా కళాశాల విద్యార్థులకు, కళాశాలకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తించిందంటూ మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో బ్లెస్సీ, ఆమెతో పాటు అక్షయ్ అనే యువకుడిపై వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారిపై కేసు నమోదు చేశారని తెలిపింది. విషయాన్ని బయట పొక్కకుండా యాజమాన్యం తీవ్ర ఒత్తిడి తెచ్చినా వినకపోవటంతో మానసికంగా చిత్రహింసలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఇంకా 3 నెలల్లో తన ఫైనలియర్ పూర్తి కానుందని ఈ పరిస్థితుల్లో సస్పెండ్ చేయటం ఎంతవరకు న్యాయమంటూ బాధితురాలు ప్రశ్నించింది.

విచారణ జరుపుతున్నాం

● సీఐ సత్యనారాయణ

భారత్ బైబిల్ కళాశాల విద్యార్థిని బ్లెస్సీ ఫిర్యాదుపై నవంబరు 1న కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నాం. బాధితురాలు బ్లెస్సీ. అక్షయ్ అనే యువకుడితో కలిసి కళాశాలలో తరగతులు నిర్వహించకుండా అడ్డుకోవటంతో కళాశాల యాజమాన్యం ఆమెపై ఫిర్యాదు చేయగా ఇద్దరిపై కేసు నమోదు చేశాం. ఈ కేసు విచారణకు ప్రత్యేకంగా మహిళ ఎస్ఐను నియమించాం. కళాశాల యాజమాన్యంతో పాటు, విద్యార్థుల వాంగ్మూలాలను సేకరిస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

ఉత్సాహంగా రాష్ట్ర చౌకీబాల్ జట్ల ఎంపికలు

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో రాష్ట్ర చౌకీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏపీ జట్ల ఎంపికలు ఉత్సాహపూరిత వాతావరణంలో మంగళవారం జరిగాయి. ఎంపికైన జట్లకు ఈ నెల 18 నుంచి కోచింగ్ క్యాంపు నిర్వహించి, తర్వాత ఈ నెల 23 నుంచి 25 వరకు హైదరాబాద్‌లో జాతీయ చౌకీబాల్ చాంపియన్‌షిప్‌కు పంపుతామని రాష్ట్ర కార్యదర్శి సుధాకర్‌రావు తెలిపారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే...

బాలుర అండర్-19: జి.సాయికిరణ్, జాన్ రష్మిక్, స్టీఫెన్‌రాజు, వి.ఉమామహేశ్వరరావు, సీహెచ్ పార్థు, ఈ రామ్‌చరణ్, టి.జాగర్, (విశాఖ), భాను ప్రకాష్, ఎస్‌కే హనీఫ్ సాహిల్, సందీప్ (అల్లూరి జిల్లా), ఎస్ నాగశివ ధీరజ్, ఎం చైతన్య (ఎన్టీఆర్ జిల్లా), స్టాండ్ బైలుగా బీ వరేష్, ఎం దీపక్‌కుమార్ ఎంపికయ్యారు. బాలికలు అండర్-19 ఎం బ్యూలా, సాక్షి (అల్లూరి జిల్లా), భాగ్యశ్రీ (విశాఖ), ఎస్ కావ్యశ్రీ (శ్రీకాకుళం), కె.మానస, గీతురాయ్ (గుంటూరు), బత్ర గున్నీసా, శ్రావణి, సయ్యద్ సమీరా (ఎన్టీఆర్).

జాతీయ క్రీడలకు జట్లను పంపేందుకు చర్యలు

● ఏపీవోఏ సెక్రటరీ కేపీ రావు

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో జరగనున్న 38వ జాతీయ క్రీడల్లో అర్హత సాధించిన మన జట్లను పాల్గొనేందుకు అవసరమైన చర్యలను తీసుకుంటామని, ఈ విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ కేపీ రావు క్రీడా సంఘాలకు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ ఎన్నికల కోసం ఈ నెలలో హైకోర్టు తీర్పు ఇవ్వనుందని, అన్ని క్రీడల్లో ఒకే సంఘం ఉండేలా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించిన విషయాన్ని గుర్తించాలన్నారు. ఇప్పటి వరకు 38 సభ్య రాష్ట్ర సంఘాల్లో మెజార్టీ సభ్యులు మనతోనే ఉన్నారన్నారు. హైకోర్టు ఉత్తర్వులు జారీ చేశాక ఏపీవోఏ ఎన్నికలపై చర్చించి నిర్ణయించడానికి ఒక సమావేశం ఏర్పాటు చేస్తామని కేపీ రావు వివరించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

● రవాణా శాఖ మంత్రికి వినతి

బస్టేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణ సంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర శాఖ నేతలు మంగళవారం రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కలిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. నేతలు మాట్లాడుతూ ఇంతకు ముందే ఎన్నో అంశాలతో పాటు తాజాగా ప్రస్తావించిన సమస్యలను కూడా మంత్రికి, ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. వారంతా సానుకూలంగా స్పందించి త్వరలోనే నిర్ణయాలు చేస్తామని చెప్పారన్నారు. డ్రైవర్, కండక్టర్లకు ఈ ఏడాది జూలై నుంచి నిలిపివేసిన నైట్ హాల్ట్ అలవెన్స్ ఫైల్ ఆర్థికశాఖలో ఉందని, క్లియర్ చేయాలని మంత్రికి తెలిపామన్నారు. తాను త్వరలోనే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని మంత్రి తెలిపారన్నారు. అన్ని సమస్యలకు సత్వర చర్యలు తీసుకుంటామని తెలిపిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపామన్నారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, కోశాధికారి పి.వి. మోహన్ ఉన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.620

ఘనంగా మాజీ రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ జయంతి

తోట్లవల్లూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చాగంటిపాడు శివారు కళ్లంవారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం భారతదేశ మొట్ట మొదటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ జయంతి వేడుకలను సమగ్ర గ్రామీణాభివృద్ధి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కళ్లం ఫణికుమార్ రెడ్డి నిర్వహించి కేక్ కట్ చేశారు. విద్యార్థులకు రాజేంద్రప్రసాద్ గురించి ఆయన తెలియజేశారు. విద్యార్థులకు స్వీట్లు పంచారు. ఎంహెచ్‌ఆర్‌డీ చారిటబుల్ ట్రస్ అధ్యక్షుడు నరేంద్రసాయి తదితరులు మ పాల్గొన్నారు.

మిల్లర్లు చెప్పిన ధరకే..

● అంతకే ధాన్యాన్ని అమ్ముకోమంటున్న అధికారులు ● 1262 రకం కొనని మిల్లర్లు ● రూ.1600లకే కొంటామంటున్న ప్రైవేట్ వ్యాపారులు



వల్లూరుపాలెంలో ధాన్యం కాటా వేస్తున్న ప్రైవేటు వ్యాపారులు, లారీల్లోకి లోడింగ్

(తోట్లవల్లూరు- ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను రైస్ మిల్లర్లు అమలు చేయటంలేదు. వల్లూరుపాలెం కృష్ణానది ఒడ్డున పెద్దఎత్తున ధాన్యం ఆరబెట్టిన రైతులకు మద్దతు ధర రావటం లేదు. 1262 రకం ధాన్యాన్ని పనికి రానిదిగా మిల్లర్లు చిత్రీకరించి మద్దతు ధరకు కొనలేమని చెపుతుండటంతో అధికారులు కూడా తక్కువ ధరకు అమ్ముకోమని సలహాలు ఇస్తున్నారు. రెవెన్యూ, వ్యవసాయ అధికారులు వచ్చి మిల్లర్లు రూ 1,600 మాత్రమే ధర ఇస్తామంటున్నారని, ఆ ధరకే అమ్ముకోమని రైతులకు చెప్పటంతో చేసేది లేక ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నామని పలువురు రైతులు చెప్పారు. మంగళవారం ఐదు లోడుల ధాన్యం ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేయగా అందరు రూ 1,600లకే విక్రయించారు.

వెయ్యి బస్తాలు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించా..



నేను 15 ఎకరాల్లో వచ్చిన వెయ్యి బస్తాల ధాన్యాన్ని బస్తా రూ 1,600 చొప్పున ప్రైవేటు వ్యాపారులకు విక్రయించాను. ప్రైవేటు వ్యాపారులు గోనెసంచులు, కాటా తెచ్చి కళ్లంలో కాటా వేసి లారీల ద్వారా తరలించుకుంటున్నారు. ఇది మాకు ఎ సమస్య లేకుండా ఉంది. అధికారులు కొంటే కళ్లంలో తేమ శాతం చూసి మిల్లుకు వెళ్లాక మళ్లీ తేమ శాతం చూసి ఇబ్బంది పెడుతున్నారు. అందుచేత రైతులందరు ప్రైవేటు వ్యాపారులకే ధాన్యం అమ్ముతున్నారు.

\- బడుగు రవి ప్రసాద్, వల్లూరుపాలెం రైతు

ఫసల్ బీమాను సద్వినియోగం చేసుకోండి

వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ పద్మావతి

గుడివాడ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రైతులు రబీ పంటకు ఫసల్ బీమా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్.పద్మావతి అన్నారు. మంగళవారం గుడివాడ మార్కెట్ యార్డులో ఉన్న ఆర్‌ఎస్‌కె సెంటర్ నందు జేడీ అధ్యక్షతన బేతవోలు తదితర ప్రాంతాల రైతులకు సమావేశం, పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బీమా చేయించుకోవటం ద్వారా పంట ఇన్సూరెన్స్ లభిస్తుందని, ఎకరాకు రూ.80ల చొప్పున పంటల బీమా చేయించుకోవాలని రైతులకు సూచించారు. ప్రతీ రైతు నష్టపోకుండా ప్రభుత్వపరంగా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొంతమంది రైతులు బేతవోలులో తమకు ఆర్‌బీకే భవనం కావాలని కోరారు. స్థల భవనం ఇచ్చినట్లైతే పెడతామ న్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జేడీ పద్మావతి

బేతవోలులో సరైన భవనం లేక గుడివాడ మార్కెట్ యార్డులో ఉన్న భవనంలో పెట్టినట్లు తెలిపారు. రైతులకు మేలు చేయటానికి అధికారులు చూస్తారని తెలిపారు. తుఫాన్ ప్రభావం తగ్గుతున్నందున రైతులు తొందరపడి వరి కోతలు కోయవద్దని, రెండు రోజులు ఆగితే ధాన్యాన్ని ప్రభుత్వ రేటుకు అమ్ముకోవచ్చునని సూచించారు. మిల్లర్ల దగ్గర గోతాములు ఉన్నాయని, ఎవరికి ఎన్ని సంచులు కావాలన్నా తమ సిబ్బంది చేత సరఫరా చేస్తామన్నారు. గుడివాడ మార్కెట్ యార్డులోని మట్టి నమూనా కేంద్రాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు డివిజన్ కేంద్రంగా ఉండటంతో గుడివాడలో మట్టి నమూనా కేంద్రాన్ని జిల్లా నమూనా కేంద్రంగా ఏర్పాటు చేయటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఉన్న నమూనా కేంద్రం చిన్న చిన్న మార్పులు చేసి కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అనంతరం జేడీ అగ్రి ల్యాబ్‌లను సందర్శించి పరికరాలు ప్రస్తుత పరిస్థితి ఏ విధంగా ఉందో అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి, ఏవో బోలెం అనంతలక్ష్మి, ఆర్‌ఎస్‌కె వంజరపు సాయి, మహమ్మద్ ఇమ్రాన్, బేతవోలు తదితర ప్రాంతాల రైతులు పాల్గొన్నారు.

ముస్లింల హక్కులను హరిస్తున్న కేంద్రం

ఆవాజ్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా

గుడివాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ముస్లింల హక్కులను హరించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం దారుణమని, కేంద్రం చర్యలను ఖండించాల్సిన అవసరం అందరిపై ఉందని ఆవాజ్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మమద్ అబ్దుల్లా చిస్తీ అన్నారు. మంగళ వారం ముబారక్ సెంటర్‌లోని అంజుమన్ భవన్‌లో ది కృష్ణాజిల్లా ఇండస్ట్రీయల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్య దర్శి అబ్దుల్ ఖుద్దూస్ అధ్యక్షతన రాజ్యాంగ సరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో వక్ఫ్ యాక్టు-2024 సవరణ బిల్లుని వ్యతిరేకిస్తూ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రం చేపట్టిన సవరణలను లౌకికవాదులు అందరూ ఖండించాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. యాక్టు సవరణతో ముస్లింలు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను కోల్పోతారన్నారు. ముస్లింలందరూ ఏకతాటిపై వచ్చి సవరణ బిల్లును వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో పరిరక్షణ వేదిక కన్వీనర్ టి.లక్ష్మణరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌సీపీ రెడ్డి, ది కృష్ణాజిల్లా ఇండస్ట్రీయల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు అబ్దుల్ హమీద్, అర్బన్ బ్యాంకు మాజీ డైరెక్టర్ మహ్మమద్ ఖాసీం(అబూ), లారీ ట్రాన్స్‌పోర్టర్ అబ్దుల్ తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న అబ్దుల్లా చిస్తీ

వేతనాలందక అవస్థలు పడుతున్నాం

ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మహిళా కార్మికుల నిరసన

గుడివాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మూడు నెలలుగా సఫాయి కాంట్రాక్టర్ జీతాలు చెల్లించకుండా తమతో పనులు చేయిస్తున్నారని, కుటుంబ పోషణకు నానా తిప్పలు పడుతున్నామని, స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రి మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ సఫాయి మహిళ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ గౌరవాధ్యక్షులు గూడపాటి ప్రకాష్‌బాబు మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల కార్మికుల కాంట్రాక్టర్ గత మూడు నెలలుగా జీతాలు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్నాడన్నారు. పేరుకే రూ.16 వేలు జీతమని, పీఎఫ్‌లు కడుతున్నట్లు మోసం చేసి చేతికి కేవలం రూ.8వేలు ఇస్తున్నారని ఆరోపిం చారు. గత మూడేళ్లుగా పీఎఫ్‌లు కడుతున్నట్లు చూపి కట్టకుండా మోసం చేశాడన్నారు. తక్షణమే జీతాల బకాయిలను ఇవ్వాలని, పీఎఫ్‌లను కట్టి రూ.18వేలు జీతాలు చెల్లించకపోతే సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చింతలూరి సత్యనారాయణ, కార్మికులు వడ్డాది రమణమ్మ, కనుమూరి విజయలక్ష్మి, వేల్పుల ధనలక్ష్మి మాతంగి మేరిమ్మ, దొండపాటి పద్మవతి, కోటేశ్వరమ్మ, తేరేజమ్మ, మణిమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఏరియా ఆసుపత్రి ఎదుట కాంట్రాక్టు సఫాయి కార్మికుల నిరసన

మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్వరరెడ్డి మృతి

తోట్లవల్లూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దేవరపల్లి మాజీ ఎంపీటీసీ, టీడీపీ సీనియర్ నేత భీమవరపు వెంకటేశ్వరరెడ్డి(60) మంగళవారం హఠన్మరణం చెందారు. మీ సేవ కేంద్రం వద్ద కుప్పకూలి అక్కడికక్కడే మరణించినట్లు బంధువులు తెలిపారు. ఆయనకు కుమారుడు, భార్య ఉన్నారు.



వెంకటేశ్వరరెడ్డి) (ఫైల్‌ఫొటో)



గుడివాడలో దివ్యాంగునికి బహుమతిని అందజేస్తున్న ఎంపీడీవో విష్ణుప్రసాద్



పెదపారుపూడిలో బహుమతి అందజేస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు



పామర్రులో..



మొవ్వలో..

దివ్యాంగులకు చేయూతనివ్వాలి

పామర్రు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులను ఆదరించి వారికి చేయూతను అందివ్వాలని నిడుమోలు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం పి.శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని ఎలకుర్రులో కేడీబీ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివ్యాంగుల పాఠశాలలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీనివాస్ మాట్లాడుతూ, దివ్యాంగులకు కేడీబీ ట్రస్టు అందిస్తున్న చేయూత ఎంతో అభినందనీయమని ఇది మరెన్నో సేవా సంస్థలకు ఆదర్శం కావాలని కోరారు. ఇదేవిధంగా పామర్రులోని ఎంపీపీ బాలకల పాఠశాలలో సమగ్రశిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. వివిధ పోటీల్లో విజేతలైన దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎలకుర్రు కేడీబీ ట్రస్టు కార్యదర్శి కాశీనాధుని నాగేశ్వరావు, తెలుగు ఉపాధ్యాయుడు పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమతో ఆదరించాలి

కూచిపూడి : దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలని జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధరాజు పేర్కొన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని మొవ్వ భవిత కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. దివ్యాంగులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించగా, విజేతలకు బహుమతులు అంద జేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.మస్తాన్, ఎంఈవోలు శివశంకర్, శ్రీలక్ష్మి, పాఠశాలల హెచ్‌ఎంలు శ్రీదేవి, నాగలక్ష్మి, మండవ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెదపారుపూడి భవిత కేంద్రంలో..

పెదపారుపూడి : ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల విద్యావనరుల కేంద్రంలో దివ్యాంగులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి, ఆ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు స్థానిక ఎంపీడీవో టి.సీతామహాలక్ష్మి వివిధ రకాల బహుమతులు అందించినట్లు ఐఈఆర్పీ హరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బొడ్డు శ్రీని వాసరావు, సురేష్, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు భవిత కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ పోటీలు నిర్వహించి దివ్యాంగులకు బహుమతులను అందించారు. ఎంపీడీవో రవికాంత్, ఎంఈవో-2 సురేష్, జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఫణికుమార్, ఐఈఆర్పీ టీచర్స్ ఎన్ నిరుపమ, టి పద్మావతి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురంలో..

పమిడిముక్కల : కపిలేశ్వరపురం భవిత కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఎంఈవో-2 ఎస్.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై దివ్యాంగ బాలలకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. జడ్పీస్కూల్ హెచ్‌ఎం కె. శ్యామ్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కె.వర్ధనమ్మ, ఉపాధ్యాయురాలు మాధవి, ఐఈఆర్పీఎస్ రజనీకుమార్, అంజనీదేవి, సీఆర్పీ రవి, బాలల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

గుడివాడ : రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో బి.వై విష్ణుప్రసాద్ అన్నారు. మంగళవారం ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష, గుడివాడ భవిత కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లోని విజేతలకు బహుమతులను అందజేశారు. విద్యలో రాణించే విధంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి పని చేయాలన్నారు. దివ్యాంగులను ప్రోత్సహించి జనస్రవంతిలో కలుపుకుని పురోగతికి పాటుపడే విధంగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బి.బాలాజీ, పాఠశాల హెచ్‌ఎం పి.ఎల్ నరసమాంబ, ఆంధ్ర నలంద మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.లక్ష్మీ స్రవంతి, భవిత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



రావికి ఘన సత్కారం

గుడివాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావును ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఆయనతో పాటుగా స్థానిక ఎన్‌టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్‌ను కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పుట్టి రామచంద్రశేఖర్, ఉపాధ్యక్షులు కె.సాంబశివరావు, జిల్లా నాయకులు నిమ్మగడ్డ శివశంకర్, కేవీ రామకృష్ణ, డివిజన్ అధ్యక్షులు అర్జా ప్రసాద్, కార్యదర్శి లింగమనేని జగదీష్, అర్జా వెంకటేశ్వరరావు, విద్యాలయ విజయభాస్కర్, నజ్జా అనీల్‌కుమార్, వ్యాయమోపాధ్యాయులు మడక ప్రసాద్, అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర వస్తువుల పంపిణీ

గుడివాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల వరద ముంపుబారిన పడిన బాధితులకు లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ సభ్యులు 50కిట్‌లను పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక లయన్స్ మల్టీ ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్‌లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం, వరద ముంపు బాధితులకు నిత్యావసర వస్తువులు, దుస్తుల కిట్‌లను పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గవర్నర్ గద్దె శేషగిరిరావు పాల్గొన్నారు. రీజనల్ ఛైర్మన్ ఉపద్రష్ట రాంబాబు 50 మొక్కలను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఉప్పలపాటి సతీష్, కార్యదర్శి జి.వేణు, కోశాధికారి పి.సుబ్రహ్మణ్యం, కృష్ణకిషోర్, వాసు, ప్రగతి, సంఘమిత్ర సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరెడ్డి

హ్యాండ్‌రైటింగ్ పోటీల్లో ఏఎన్‌ఎం విద్యార్థుల ప్రతిభ

పామర్రు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మదర్ థెరెస్సా చిల్డ్రన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో గత నెలలో నిర్వహించిన హ్యాండ్‌రైటింగ్, కలరింగ్ విభాగపు పోటీల్లో పామర్రు ఏఎన్‌ఎం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు పాల్గొని ప్రతిభను కనబరిచారు. వారికి మంగళవారం స్థానిక పాఠశాలలో ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శామ్యూల్ తో కలసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.620

డీఎంహెచ్‌వో గీతాబాయి పెడన పీహెచ్‌సీ తనిఖీ



పెడన, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి గీతాబాయి మంగళవారం పెడన పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. కాన్పుల సంఖ్య ను పెంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆమె కాకర్లమూడిలో స్క్రీనింగ్ టెస్టుల గురించి తెలుసుకున్నారు. నోరు, బ్రెస్ట్, సర్వైకల్ కేన్సర్ల లక్షణాలను తెలియచేసి, అటువంటి వారిని గుర్తించి ఆసుపత్రులకు రిఫర్ చేయాలని గీతాబాయి సూచించారు. పెడన పీహెచ్‌సీ వైద్యురాలు మీనాక్షిదేవి, ఎంపీఈవో సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యపు గింజా కొంటాం

● రైతులు అధైర్య పడొద్దు
● ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఘంటసాలలో గొట్టిపాటి విగ్రహానికి నివాళులర్పిస్తూ..

చల్లపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం ఆరబెట్టుకునే పరిస్థితి లేకపోవటంతో మిల్లర్లు అయినకాడికి దోచుకుంటున్నారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఎదుట రైతు నాయకులు, రైతులు ఏకరువుపెట్టారు. ధాన్యం కొనుగోళ్లపై మంగళవారం చల్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ వ్యవసాయ, రెవెన్యూ అధికారులు, రైసు మిల్లు యజమానులతో సమీక్ష నిర్వహించారు. రైతుసంఘం రాష్ట్ర నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ మాట్లాడుతూ, రైతుసేవాకేంద్రంలో వచ్చిన తేమశాతం కంటే రైస్‌మిల్లులో ఎక్కువగా చూపుతున్నారని ఫిర్యాదు చేశారు. 1262 రకం ధాన్యం కొనుగోలు చేయటం లేదన్నారు. మాజీ డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ, బీపీటీ ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయటం లేదన్నారు. పాగోలు రైతు నేత మేకా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, అధికారుల మాటలు మిల్లర్లు వినటం లేదన్నారు. మరో రైతు మేకా శివప్రసాద్ మా ట్లాడుతూ, మోపిదేవి రైస్‌మిల్‌లో తేమశాతం కాకుండా బస్తాకు రెండు కిలోల చొప్పున తగ్గించారన్నారు. రైతు శేషాద్రి, కౌలు రైతు నాగేశ్వరరావు మాట్లాడుతూ, పాగో లు మిల్లులో రూ.1400లకు ధాన్యం అమ్ముకోవాల్సి వచ్చిందన్నారు. 80 కిలోల బస్తాకు నాలుగు కిలోల తరు గు తీశారని వాపోయారు. వేరే మిల్లుకు అమ్ముకుందామంటే ఆన్‌లైన్‌లో రెండు మిల్లులే చూపించాయన్నారు. రైస్‌మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు సిహెచ్.శ్రీనివాసరావు రైతుల సమస్యలు విని సంబంధిత రైస్‌మిల్లర్లతో మాట్లాడారు. రైస్‌మిల్లర్ల సమస్యలు సైతం పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. 1262 ధాన్యం కొనుగోలు చేయటం తమకు భారమైనప్పటికీ కొంత మేరకు అన్ని మిల్లులూ భరిస్తామన్నారు. మండలి వెంకట్రామ్, ఎంపీపీ కోట విజయరాధిక, వైస్‌ఎంపీపీ మోర్ల రాంబాబు, సర్పంచ్ కృష్ణకుమారి, ఎంపీడీవో ఎవి.రమణ, ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీలత, ఏవో జి.సాయిసింధు, సివిల్ సప్లయిస్ డీటీ శ్రీనివాసరావు, ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, యార్లగడ్డ శ్రీనివాసరావు, మోర్ల శివ, గొరిపర్తి సుబ్బారావు, వేమూరి రత్నగిరి, వంశీకృష్ణ, వాసిరెడ్డి రాకేష్, మేకా శివ నాగేశ్వరరావు, తాతా ప్రదీప్, పరిశె మౌళి, వీరబాబు, నందగోపాల్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

ఘంటసాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై రైతులు, అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. 1262 రకం ధాన్యం కూడా కొనుగోల్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ బి.విజయప్రసాద్, ఎంపీడీవో సుబ్బారావు, ఏవో కె.మురళీకృష్ణ, టీడీపీ నాయకులు తుమ్మల చౌదరిబాబు, పరుచూరి సుభాష్ చంద్రబోస్, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, మిక్కిలినేని మధు, పరిశె చలపతి, వేమూరి సాయివెంకటరమణ, యువనేత మండలి వెంకట్రామ్, అధికారులు పాల్గొన్నారు.

గొట్టిపాటి బ్రహ్మయ్యకు నివాళి

స్వాతంత్ర్య సమరయోధులుగొట్టిపాటి బ్రహ్మయ్య జయంతిని మంగళవారం ఘంటసాలలో ఘనంగా నిర్వహించారు. కేడీసీసీ బ్యాంక్ వద్ద ఉన్న గొట్టిపాటి బ్రహ్మయ్య విగ్రహానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామానికి, దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. టీడీపీ నేతలు పాల్గొన్నారు.



నాగాయలంకలో పడిపోయిన దుబ్బులను నిలబెట్టి కట్టుకట్టిన రైతులు

నేలవాలిన వరి..అన్నదాతకు కష్టాలు

నాగాయలంక, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి, ఈదురుగాలులకు మండలంలోని పలు గ్రామాలలోని వరి చేలు నేలవాలి నీటిలో నానుతున్నాయి. పలు గ్రామాల్లో వరి కంకులు నీటిలో నానకుండా రైతులు నిలబెట్టి కట్లు కడుతున్నారు. మర్రిపాలెం, భావ దేవరపల్లి, చోడవరం, కమ్మనమోలు, టి.కొత్తపాలెం, గణపేశ్వరం, పెదపాలెం, పర్రచివర, నాగాయలంక గ్రామాలలో వరి నేలకొరిగింది. మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. దీంతో వరి పంటకు ఎక్కువ నష్టం జరుగుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

డంపింగ్ యార్డు సమస్య పరిష్కరించాలి



ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న రాజనాల వీరబాబు

అవనిగడ్డ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) :డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలని కోరుతూ జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు రాజనాల వీరబాబు మంగళవారం ఎంపీడీవో మరియ కుమారికి వినతిపత్రాన్ని అందజేశారు. రక్షిత నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు. మురుగు నీరు పోయే యూటీల పూడికతీయించాలని వినతిపత్రంలో కోరారు.



కృషి విజ్ఞాన కేంద్రంలో కార్యక్రమాలను దుర్గాప్రసాద్‌కు వివరిస్తున్న సుధారాణి

వ్యవసాయ పరిశోధనా శాస్త్రవేత్త కృషి విజ్ఞాన కేంద్రం సందర్శన

ఘంటసాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రాన్ని వ్యవసాయ పరిశోధన సహాయ సంచాలకులు డాక్టర్ ఎన్.వి.వి.ఎస్.దుర్గాప్రసాద్ మంగళవారం సందర్శించారు. శాస్త్రవేత్తల కార్యాచరణ అంశాలను నిశితంగా పరిశీలించారు. కేవీకే అభివృద్ధి కోసం మరిన్ని సలహాలు శాస్త్రవేత్తల బృందానికి అందజేశారు. కోళ్ల పెంపకం, డైరీ యూనిట్, మేకల పెంపకం, వానపాముల ఎరువుల తయారీ కేంద్రం, అజోల్లా, ఉద్యాన నారు పెంపకం, వరి విత్తన ఉత్పత్తి కేంద్రం గురించి సమన్వయ కర్త డాక్టర్ డి.సుధారాణి ఆయనకు తెలియజేశారు. శాస్త్రవేత్తలు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. వీరబాబు ఎంపిడివోకు సమర్పించిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

మోపిదేవి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో ప్రాణాలను రక్షించే సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆరోగ్య భారతి కార్యదర్శి డాక్టర్ గుడిసేవ విష్ణుప్రసాద్ అన్నారు. మోపిదేవి ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మంగళవారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. గుండెపోటుతో గురైన వారిని ఎనిమిది నిముషాల వ్యవధిలో సీపీఆర్ చేయటంతో ప్రాణాపాయం నుంచి బయటపడతారన్నారు. పాముకాటు కంటే భయం వల్ల ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రథమ చికిత్స అనేది ఎంతో ముఖ్యమైన అంశం అని మరిచి పోతున్నారన్నారు. ఆరోగ్యశాఖ ప్రధాన వక్త వంగర శేషగిరిరావు, ఎంఈవో దుర్గాసాగర్ తదితరులు ఉన్నారు.

టీడీపీ నాయకుడు రామకృష్ణ రోడ్డు ప్రమాదంలో మృతి



కావూరి రామకృష్ణ (ఫైల్)

మోపిదేవి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి గ్రామ టీడీపీ అధ్యక్షుడు కావూరి రామకృష్ణ (52) రోడ్డు ప్రమాదంలో మంగళవారం మృతి చెందారు. టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడిగా పని చేస్తున్న రామకృష్ణ చల్లపల్లి వైపు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా, బస్టాండ్ సమీపంలో పాఠశాల విద్యార్థుల గుంపుగా అడ్డురావటంతో ఒక్కసారిగా సడన్ బ్రేక్ వేయటంతో బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడ్డాడు. తలకు బలమైన గాయాలు కావటంతో వెంటనే కారులో చల్లపల్లి ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. వైద్యు లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు రావివారిపాలెం గ్రామంలోని నివాసానికి వెళ్లి రామకృష్ణ భౌతికకాయానికి నివాళులర్పించారు. మృతుని భార్య ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలిగా పని చేస్తుండగా, ఒక కుమారుడు ఉన్నారు.

సర్కిల్ కార్యాలయానికి కంప్యూటర్ వితరణ



సీఐ ఈశ్వరరావుకు కంప్యూటర్ అందజేస్తున్న వేములపల్లి సురేష్

చల్లపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి సర్కిల్ కార్యాలయానికి పురిటిగడ్డ ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవాసంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ రూ.40 వేల విలువైన కంప్యూటర్‌ను వితరణగా అందచేశారు. చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, ఐడబ్ల్యు రామ్మోహనరావు ఉన్నారు. డైరెక్టర్ సురేష్ సహకారాన్ని సీఐ ఈశ్వరరావు అభినందించారు.

గంగానమ్మ ఆలయంలో చోరీ

గూడూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆకులమన్నాడు గంగానమ్మ అమ్మవారి ఆలయంలో సోమవారం చోరీ జరిగింది. హుండీలోని నగదు, అమ్మవారి మెడలోని రెండు సూత్రాలు, వెండి పట్టాలు, మరి కొన్ని విలువైన ఆభరణాలు చోరీకి గురయ్యాయి. కమిటీ సభ్యులు పెద్దిశెట్టి నాగరాజు ఫిర్యాదు మేరకు ఎస్సై కె.ఎన్.వి. సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మంత్రి లోకేష్‌ను కలిసిన బూరగడ్డ కిషన్‌తేజ్

చుక్కల భూముల సమస్య పరిష్కరించాలి

● మంత్రి లోకేష్‌కు కిషన్‌తేజ్ వినతి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చుక్కల భూముల సమస్యను పరిష్కరించాలని మంత్రి నారా లోకేష్‌కు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బూరగడ్డ వేదవ్యాస్ కుమారుడు బూరగడ్డ కిషన్‌తేజ్ వినతిపత్రం సమర్పించారు. 2015 రిజిస్ట్రేషన్ చట్టాన్ని తొలగించాలని కోరారు. భూములను 22ఏ కింద నిషేధిత జాబితాలో చేర్చడం వ్లల యజమానులు తీవ్ర ఇక్కట్లుపడుతున్నారన్నారు. ఈ సమస్యకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపించాలన్నారు. దీనిపై మం త్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించారన్నారు.

కానూరులో అగ్నిబాధితులకు సాయం

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వన్నారు కానూరు గ్రామంలో అగ్నిబాధిత ఈమన సత్యనారాయణకు తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్య నారాయణ బియ్యం, నగదు, నిత్యావసర వస్తువులు అందచేశారు. వీఆర్వో గోవిందరాజులు, సిహెచ్. అయ్యప్ప, గోపు వెంకటరమణ, బి. నాని, ఈమన ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కూటమి నేతలు



బుద్ధప్రసాద్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జనసేన నాయకులు

అభివృద్ధి వైసీపీకి కన్పించడం లేదా!

● సింహాద్రి వ్యాఖ్యలపై కూటమి నేతల ఆగ్రహం ● చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం

కోడూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కళ్లుండి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూడలేని కబోదులుగా వైసీపీ నాయకులు అవాకులు, చవాకులు పేలుతున్నారని మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు దుయ్యబట్టారు. వైసీపీ నాయకుల వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం కోడూరు ప్రధాన సెంటర్‌లో కూటమి నేతల ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో ఆరు నెలల్లో కోట్లాది రూపాయల నిధులతో డ్రైనేజీ, పంట కాలువల పూడికతీత పనులు, సీసీ రోడ్ల నిర్మాణం చేస్తూ అభివృద్ధిపథంలో ముందుకు సాగుతుంటే, ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు విమర్శలు చేయటం తగదన్నారు. కూటమి నాయకులు ఉల్లి శేషగిరిరావు, వేములపల్లి రాజేష్, కడవకొల్లు శ్రీనివాసరావు, పిల్లి మల్లిఖార్జునరావు, అద్దంకి పాండురంగారావు, బొడ్డు వెంకన్న, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, మేడా శివాజీ, గోగినేని సోమశేఖరరావు, దావు మల్లిఖార్జునరావు, కాగిత ప్రసాద్, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో

బుద్ధప్రసాద్ చేసిన అభివృద్ధి నియోజకవర్గంలో ఏమండలానికి వెళ్లినా కనిపిస్తోందని మండల జనసేన పార్టీ అధ్యక్షుడు మర్రే గంగయ్య అన్నారు. మంగళవారం జనసేన పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అభివృద్ధి చేయలేదని బుద్ధప్రసాద్‌పై ప్రతిపక్ష నేతలు విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. పూతబోయిన సాయిబాబు, కోట రాంబాబు, కాగిత రామారావు, కనగాల వెంకటేశ్వరరావు, మల్లా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయానికిచ్చిన నోటీసు వెనక్కి తీసుకోవాలి

● అయ్యప్ప దీక్షాపరుల ర్యాలీ



ర్యాలీగా వెళ్లి కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న అయ్యప్ప దీక్షాపరులు

కోడూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కోడూరు గ్రామపంచాయతీ అయ్యప్ప స్వామి దేవాలయానికి ఇచ్చిన నోటీసు వెనక్కి తీసుకోవాలని కోరుతూ వేలాది మంది దీక్షాపరులు మంగళవారం కోడూరులో ర్యాలీ నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద కార్యదర్శి బండే శేషగిరిరావు, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ శ్రీను నాయక్‌కు వినతిపత్రాలు అందజేశారు. కోడూరు ఒకటో వార్డులో అయ్యప్ప స్వామి దేవాలయ స్థలం ఎదురుగా మరుగుదొడ్ల తొలగించాల్సిందిగా గ్రామపంచాయతీని దేవాలయ కమిటీ కోరగా, వాటిని తొలగించేందుకు అక్టోబర్ 5, 1998లో తీర్మానం చేశారు. దేవాలయ నిర్మాణం అనంతరం సుమారు 24 సంవత్స రాలుగా అయ్యప్పస్వామి దేవాలయ ఆధ్వర్యంలోనే ఆ స్థలం ఉంది. భక్తుల సౌకర్యా ర్థం సదరు స్థలంలో మెరక తోలి చుట్టూ మెరక పోకుండా బేస్‌మెంట్ వేసి ఫ్లోరింగ్ చేయించారు. దీంతో మెరకు తొలగించాలని పంచాయతీ దేవాలయానికి నోటీసు నోటీసును వెనక్కి తీసుకోవాలని భక్తులు కోరారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బడే భావన్నారాయణ, ఆలయ ప్రధాన అర్చకులు కొమ్మూరు శ్రీను గురుస్వామి, కమిటీ సభ్యులు, స్వాములు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదరించాలి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులను ఆదుకోవాలని ఎంఈవో దుర్గాప్రసాద్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం భవిత కేంద్రంలో ఎంఈవో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈవో 2 వై.ఎస్.ఆర్.కె. గురుప్రసాద్, ఐఈఆర్‌టీ టీచర్ స్వాతి, సిహెచ్. రమణ పాల్గొన్నారు.పెడన : విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం సౌకర్యాలను కల్పిస్తోందని సమగ్ర శిక్ష జిల్లా ఏపీవో కళ్ళేపల్లి ఏడుకొండలు అన్నారు. భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందచేశారు. హెచ్‌ఎం జి. భాగ్యలక్ష్మి, ఎస్ఎంసి కమిటీ వైస్ చైర్మన్ ఎండి బాబు, ఐఈఆర్‌పి ఎస్. రమ్య తదితరులు పాల్గొన్నారు. లెప్రా సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ కొండ్రు సాయిప్రీతి, లెప్రా సొసైటీ స్టేట్ కో ఆర్డినేటర్ ఎం. రాధిక, ఓఆర్‌డబ్ల్యు ఎం. నాగవాణి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. **ఘంటసాల** : దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలని ఎంఈవో -2 ఎండి.మోమిన్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం శ్రీకాకుళంలోని భవిత కేంద్రంలో నిర్వహించారు. సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), హైస్కూల్ హెచ్‌ఎం అనుపల్లవి భువనేశ్వరి, ఉపసర్పంచ్ శీలం శ్రీనివాసరావు, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.నాగ బాబు, ఉపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ కోటేశ్వరరావు, ఐఈఆర్పీలు జి.శ్రీకాంత్, నాగరాజు పాల్గొన్నారు. **కోడూరు** : దివ్యాంగులను ఆదరించాలని ఎంఈవో టి.వి.ఎం.రామదాసు అన్నారు. మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఐఈఆర్‌పీ బి.రంగాదేవి ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. మండల పరిషత్ టీచర్స్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఆధ్వర్యంలో 85 మంది దివ్యాంగులకు రూ.400లు చొప్పున స్కాలర్‌షిప్ అందించారు. టీచర్స్ సొసైటీ కార్యదర్శి ఎం.ప్రేమచంద్, డైరెక్టర్లు ఎస్.సూరయ్య, యు.ప్రసాద్ పాల్గొన్నారు. **చల్లపల్లి** : భవిత కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఎంఈవో పి.వెంకటేశ్వరరావు హెచ్‌ఎం ఎ.దేవి పార్వతి, సీఆర్పీ బి.సునీత, ఐఈడీ స్కూల్ అసిస్టెంట్ అనిల్‌కుమార్, ఐఈఆర్పీలు కె.గౌరి, ఎస్.లక్ష్మి పాల్గొన్నారు. **నాగాయలంక**: దివ్యాంగులను ప్రేమాభిమానాలతో చూడాలని వక్తలు అన్నారు. కె.కొత్తపాలెం పాఠశాల భవిత కేంద్రంలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం జరిగింది. ఎంఈవో ఎ.రామారావు అధ్యక్షత వహించగా, తహసీల్దార్ ఎం.హరనాథ్, డీటీ మహ్మద్ రఫీ పాల్గొన్నారు.